దీర్ఘకవిత

# మృత్యుమోహనం



డా॥ శ్రీలత

# మృత్యుమోహానం

(దీర్ఘ కవిత)

డా॥ మోడేపల్లి శ్రీలతా కోటపాటి

పాలపిట్ట-బుక్స్
హైదరాబాద్

**MRUTYUMOHANAM**
Long Poem by
**Dr. MODEPALLI SRILATA KOTAPATI**
Cell: 98493 63891

First Edition : December, 2012

Cover Design : Haneef Shaik

For Copies : Palapitta Books
# 16-11-20/6/1/1
403, Vijayasai Residency
Saleem Nagar, Malakpet
Hyderabad - 500 036
Phone: 040-2767 8430
palapittabooks@gmail.com

Printed at : Charita Impressions
Azamabad,
Hyderabad
PH: 040-2767 8411

Price : ₹ 50



విశ్వకవి డా॥ సి. నారాయణరెడ్డి గారికి

విశ్వకవితా వస్తువు 'మృత్యుమోహనం'

వినమ్రంగా అంకితం.




శ్రీలత దీర్ఘకవిత 'మృత్యుమోహనం' పుస్తకాన్ని శ్రీలంక రాజధాని కొలంబోలో డిసెంబర్ 2012లో జరిగిన ఓ కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ ఇండియన్ కల్చరల్ సెంటర్ (శ్రీలంక) ఎం. రామచంద్రన్ గారి చేతుల మీదుగా ఏ.ఐ.పి.సి. ఫౌండర్ లారీ అజాద్ ఆవిష్కరించినప్పటి దృశ్యం.

జ్ఞానపీఠ అవార్డు గ్రహీత
**డాక్టర్ సి. నారాయణరెడ్డి** ఎక్స్ ఎం.పి.
ఎం.ఏ., పిహెచ్.డి, డి.లిట్

అధ్యక్షులు
**ఆంధ్ర సారస్వత పరిషత్తు**
తిలక్ రోడ్, హైదరాబాదు - 500 001
ఫోన్: (ఆ) 24753724

# అభినందనలు

శ్రీమతి డా॥ మోడేపల్లి శ్రీలతా కోటపాటి గారు రచించిన ఈ దీర్ఘకవితలో మృత్యుభీతి లేదు. మృత్యుప్రీతి తప్ప. మరణ నిరాకరణం లేదు. మరణ వరణం తప్ప. ఈ దీర్ఘకవితకు పెట్టిన "మృత్యుమోహనం" అనే పేరులోనే ఈ కవయిత్రి ప్రగాఢ తాత్విక దృక్పథం ప్రస్ఫుటమవుతున్నది.

ఈ కవితను చదువుతూ వుంటే, మృత్యువంటే భయపడే వారి పైన జాలి కలుగుతుంది. మృత్యువును వస్తువుగా తీసుకుని ప్రతీకాత్మక కావ్యరచన చేసిన డా॥ శ్రీలత గారిని అభినందిస్తున్నాను. సందర్భోచితంగా ఏనాడో నేను రచించిన కవితలోని ఈ పంక్తులను గుర్తు చేసుకుంటున్నాను.

*"మరణం నను వరించి వస్తే ఏమంటాను*
*పాలు పట్టీ జోల పాడీ పడుకోమంటాను."*

నేను మృత్యువులో శిశుత్వాన్ని చూస్తే, డా॥ శ్రీలత గారు మోహనత్వాన్ని అవలోకించారు.

అదీ విశేషం.

(డా॥ సి.నారాయణరెడ్డి)

# విలక్షణం - కొత్త ప్రయోగం

మోడేపల్లి శ్రీలతా కోటపాటి ఇప్పుడు మన చేతుల్లో పెట్టిన 'మృత్యుమోహనం' విలక్షణమైన కవిత. కొత్త ప్రయోగం. 'మరణం తన వెంట వుంది అనే భావన మనిషి ఆలోచనాసరళినే మార్చివేస్తుంది' అనే మెలకువ ఈ కావ్యానికి ఇతివృత్తం. ఇటువంటి మెలకువ నుంచే శ్రీమహాభాగవతం రూపొందింది. మరొక ఏడు రోజుల్లో తాను మరణిస్తానని తెలియగానే తనకు మిగిలిన కొద్దిపాటి జీవిత కాలాన్నీ గోవింద లీలాచరితం వింటూ గడపాలని పరీక్షిత్తు కోరుకున్నాడు.

*ఏడుదినంబుల ముక్తిం, గూడగ నేరీతి వచ్చు గురుసంసార*
*క్రీడనమే క్రియ నెడతెగుజూడుడు మా తండ్రులార! శ్రుతివచనములన్*

అని వేదవేత్తల్ని కోరుకున్నాడు.

కాని ఈ కావ్యం ఓ స్త్రీ కలం నుంచి వెలువడింది. మృత్యువు గురించి ఇంతదాకా రాసిన కవులంతా దాదాపుగా పురుషులు. మానవ ప్రపంచం ప్రీతితో స్మరించుకునే పురాణ గాథల్లో, గొప్ప ఇతిహాసాల్లోని ప్రతి ఒక్క కథా నాయకుడూ ఏదో ఒక సందర్భంలో నరకాన్ని చూసినవాడే. గ్రీకు, రోమన్ పురాణగాథలు మొదలుకుని ప్రతి ఐరోపీయ మానవేతిహాసంలోనూ నరకాన్ని చూడని నాయకుడు లేడు. థేసియస్, హెర్క్యులిస్, ఒడెస్స్యూస్, ఆర్ఫియస్ ప్రతి ఒక్క పురాణవీరుడూ నరకం ముంగిట అడుగుపెట్టినవాడే. హోమర్, వర్జిల్, డాంటేల నుంచి ఇలియట్ దాకా పాశ్చాత్య మహాకవులంతా మృత్యువునీ, నరకాన్నీ సమానార్థకాలుగా భావించేవాళ్లే. నరకం నుంచి బయటపడ్డ తరువాతనే డాంటేకి బియాట్రిస్ దర్శనమిచ్చింది. చివరికి మహాభారతంలో యుధిష్ఠిరుడు కూడా కొన్ని క్షణాల పాటైనా నరకంలో గడపకపోలేదు. కాని పురాణ వాఙ్మయంలో స్త్రీలు మృత్యువుతో ముఖాముఖి నిలబడ్డ సంఘటనలు, నరకంలో అడుగుపెట్టిన సందర్భాలు చాలా అరుదు.

అలాగని అసలు లేరని కాదు. కనీసం ముగ్గురు స్త్రీలు ఈ క్షణాన్న నాకు గుర్తొస్తున్నారు.

ఒకరు. ప్రాచీన సుమేరియన్ నాగరికతా కాలంలో ప్రేమాధిదేవతగా కీర్తించబడ్డ ఇనానా. ఆమెనే బాబిలోనియన్ నాగరికతా కాలంలో ఇష్తర్‌గా పూజలందుకుంది. ఒకప్పుడు ఇనానా తనంత తనే నరకలోకంలో అడుగుపెట్టింది. ఆ సాహస ప్రయత్నం 'నరకంలోకి ఇనానా ప్రయాణం' పేరిట ఒక దీర్ఘకవితగా లభ్యమవుతోంది. ఆమె నరకంలోకి ఎందుకు ప్రవేశించాలనుకున్నదో మనకు స్పష్టంగా తెలియదు. కాని మృత్యు రహస్యం తెలుసుకోవడానికీ, మరింత వివేక సంపన్నవతి కావడానికీ మాత్రమే ఆమె అటువంటి దుస్సాహసానికి పూనుకున్నదని మనం అనుకోవలసి వుంటుంది.

మరొక ఉదాహరణ, ప్రాచీన గ్రీకు పురాణగాథల్లోని పెర్సిఫోన్, గ్రీకు పురాణాల ప్రకారం డెమిటర్ సస్యాధిదేవత. పంటల దేవత. పెర్సిఫోన్ ఆమె పుత్రిక. నరకాధిదేవత హేడ్స్ ఆమెని చూసి మోహించి బలవంతంగా నరకానికి తీసుకుపోయాడు. తన కూతురు దూరమైన బెంగతో డెమెటర్ జీవితాన్ని నిర్లక్ష్యం చేసింది. దాంతో పంటలు పండలేదు. లోకంలో క్షామం వ్యాపించింది. దేవతలంతా పోయి స్వర్గాధినాథుడైన జ్యూస్‌కి మొరపెట్టుకున్నారు. ఆయన పెర్సిఫోన్ తిరిగి ఒలంపస్ పర్వతం మీదకు రావడానికి ఒప్పుకున్నాడు గానీ, ఒక షరతు పెట్టాడు. పెర్సిఫోన్ నరకలోకంలో ఏ ఆహారాన్నీ ఆరగించక పోతేనే, ఆమెకు తిరిగి బయటకు రావడానికి అర్హత అని. కాని అప్పటికే పెర్సిఫోన్ ఆకలికి తాళలేక, నరకలోకంలో కొన్ని దానిమ్మగింజలు ఆరగించింది. అందుకని, ఆమె ప్రతి ఏడాదీ హేమంత శీతాకాలాల్లో నరకంలో గడపాలి, వసంత ఋతువు ప్రవేశించేటప్పుడు మాత్రమే భూమ్మీద అడుగుపెట్టాలని పరమేశ్వరుడు ఆజ్ఞాపించాడు.

ఇక మూడవ ఉదాహరణ, జగత్ప్రసిద్ధురాలు సావిత్రి. సావిత్రి సత్యవంతుడి ప్రాణాల కోసం యముడి వెంట నరకానికి నడిచింది. మృత్యువుతో సంవాదించి, ఒప్పించి, ప్రార్థించి తన సహచరుణ్ణి వెంట తెచ్చుకుంది. అపురూపమైన ఈ ఇతివృత్తాన్ని కవితగా మలచడానికి వ్యాసుడి నుంచి అరవిందుల దాకా ఎందరో భారతీయ కవులు ఉవ్విళ్ళూరారు.

శ్రీలత కవిత చదవగానే నాకు ఈ మహనీయమైన పూర్వకావ్యాలూ, పూర్వ ఇతివృత్తాలూ తలపుకొచ్చాయి. కాని ఈమె రాసిన కవిత పూర్వోక్త ఉదాహరణలకన్నా ఎంతో ప్రత్యేకంగా కనిపిస్తోంది. పూర్వగాథల్లో స్త్రీలు మృత్యువుతో తలపడటమంటే నరకానికి పోవడంగా భావించారు. కాని శ్రీలత మృత్యువుని నరకంగా భావించడంలేదు. ఆమె మాటల్లోనే చెప్పాలంటే: ('అన్నిటినీ మించి ఓ పురుషునికి తన ప్రియమైన పడతి) ఆహ్లాదకరం. అలాగే ఓ స్త్రీకి తన ప్రియమైన పురుషుడు ఆహ్లాదకరం. మరి అన్నింటినీ మించి ఆహ్లాదాన్నిచ్చే ఈ ప్రియతమ రూపాన్ని మరణానికిస్తే ఎలా ఉంటుంది?

ఇదీ నా ప్రశ్న.

ఈ ప్రశ్నకు సమాధానమే ఈ కావ్యం.'

మృత్యువుని 'మోహనం'గా చూడడం, చూపడం ఈ కావ్యం విశేషం.

కఠోపనిషత్కారుడు మృత్యువుని జ్ఞానప్రదాతగా చూసాడు. 'ధర్మానికీ, అధర్మానికీ ఆవల వున్న' జ్ఞానాన్ని, జీవిత రహస్యాన్ని బోధించగలిగే గురువుగా మృత్యువును భావించి చేసిన సంవాదం అది. ఇది అలా కాదు. ప్రేమగీతం. మృత్యువును తలుచుకోగానే తనలో రేకెత్తే పారవశ్యాన్ని పదేపదే సంభావించుకునే రొమాంటిసిజం. నాకు తెలిసి, ఈ రీతిలో మృత్యుసంభావన చేసిన కవి ఎవ్వరూ లేరు. ఎమిలీ డికిన్‌సన్, సిల్వియాప్లాత్‌వంటి కవయిత్రులు లేకపోలేదు. కాని వారి ధ్యానవస్తువు ఆసాంతం మృత్యువు కాదు. డికిన్‌సన్ వేదాంతిలాగా నిర్గుణసత్యాన్ని ఆరాధించిన కవయిత్రి. సిల్వియాప్లాత్ ప్రధానంగా ప్రేమికురాలు. ప్రేమ విహ్వలత వల్ల, ప్రేమ వైఫల్యం వల్ల ఆమె మృత్యువు ఎదట నిలబడింది. సావిత్రిలాగా ఆమెకు కూడా తన ప్రేమను కాపాడుకోవడం ప్రధానం. కోరి మృత్యువుకి ఎదురేగవలసిన అవసరం ఆమెకు లేదు.

బహుశా ప్రాచీన సుమేరియన్ ప్రేమదేవత ఇనానా లాగా శ్రీలత కూడా కోరి మృత్యువు ఎదట నిలబడుతున్నది. అయితే, ఇక్కడ కూడా ఒక తేడా ఉంది. ఇనానా, బహుశా, మృత్యు రహస్యాన్ని ఛేదించడం కోసమే నరకంలో అడుగుపెట్టింది. నచికేతుడి లాగా, ఆమె కూడా ఒక జిజ్ఞాసి. కాని తననొక ప్రేయసిగా భావించుకుని మృత్యుహస్తాలకు అప్పగించుకున్న కవయిత్రి శ్రీలత మాత్రమేనేమో అనుకోవలసి వుంటుంది.

ఈ కవిత అలలు అలలుగా ఎగిసిపడే ఒక ఉద్వేగం. ఇందులో కెరటంలాగా ఎగిసిన ప్రతిసారీ, తననూ మృత్యువునూ పోల్చి చూసుకునే ఒక మెలకువ దగ్గర విశ్రమించడం కనిపిస్తుంది. 'అతనే భావం, మనమే అక్షరం', 'అతనో చిత్రం, మనమో చూపు', 'అతనే గాఢమైన ఛాయ. మనమే నునులేత వెలుగు'లాంటి మెలకువలు 34 దాకా కనిపించాయి నాకీ కవితలో. కెరటంలాగా ఎగిసిపడుతున్న ప్రతి ఉద్వేగంలోనూ ఇమేజినేషన్‌కన్నా, భావోద్వేగపు ఒత్తిడి ఎక్కువ కనిపిస్తుంది. 'యుగాలను గాజుగోళాల్లా దొర్లిస్తూ', 'ఈ ప్రపంచం పసిపాపల నునులేత ఉదరం', 'ఆలోచించిన కొద్దీ రాటుదేలే సిద్ధాంతపు గట్టిదనం'లాంటి ప్రయోగాల్లో కొత్తదనం ఉంది. కాని, కావ్యం విశిష్టత అన్నిటికన్నా ముందు ఒక కొత్త ఇతివృత్తాన్ని సంభావించడంలోనే ఉందనిపిస్తోంది నాకు.

ఇప్పుడు కవులు తమతమ ఐడెంటిటీని అన్వేషించుకుంటూ దానికొక అభివ్యక్తి ఇవ్వడం పట్లనే ఎక్కువ మొగ్గు చూపుతున్నారు. ఇప్పటి యుగ లక్షణం ప్రకారం ఒక స్త్రీ తాను బయొలాజికల్‌గా మాత్రమే స్త్రీననీ, తన సామాజిక స్త్రీత్వం ఒక నిర్మాణమనీ, తనను అణచివుంచడానికి పురుష ప్రపంచం పన్నిన ఒక వల అనీ భావిస్తున్నది. ఆ

నిర్మాణాన్ని ఛేదించడం కోసం కవిత చెప్తున్నది. కాని, అటువంటి సామాజిక స్పృహ కూడా ఒక పరిమితివంటిదేననీ, వివేచనాపరులైన ప్రతి స్త్రీ, ప్రతి పురుషుడూ కూడా తాము అన్నిటికన్నా ముందు మనుషులమనీ, మానవత్వ రహస్యాన్ని అన్వేషించి దానికొక్క అభివ్యక్తిని ఇవ్వవలసిన బాధ్యత తమమీద ఉందనీ భావించకుండా ఉండలేరు. సుమేరియన్ ప్రణయాధిదేవత ఇనానా లాగా వాళ్ళు మృత్యువును కోరి కౌగిలించుకుంటారు. ఇచ్ఛాపూర్వకంగా నరకయాతన పడతారు. ఆ నరకం నుంచి తిరిగివచ్చి, వారు తమ అనుభవాల్ని ఎలుగెత్తి పాడుతున్నప్పుడు, ఆ పాట వినిపించినంతమేరా, మనకోసమొక స్వర్గం రూపు దిద్దుకుంటూ వుంటుందని వేరే చెప్పాలా?

హైదరాబాద్
8 ఫిబ్రవరి 2012

– వాడ్రేవు చినవీరభద్రుడు

# విశిష్ట విలక్షణ దీర్ఘకవిత

సాహిత్య రంగం కూడా ఇవాళ రాజకీయ రంగంలాగా తయారవుతోంది. ఇక్కడా కుయుక్తులూ, లాబీయింగ్‌లూ, ఫోకస్ చేసుకోవటాలూ ఎక్కువైపోతున్నాయి. అయినా సాహిత్య రచన ఒక కర్తవ్యంగా, ఒక బాధ్యతగా రాస్తున్నవారు ఉంటూనే ఉంటారు. పేరు కోసమో, అవార్డుల కోసమో కాకుండా సామాజిక తపన, హృదయ వేదనలు తొందర పెడుతూంటే రాయకుండా ఉండలేక రాస్తున్నవారు ఉన్నారు. ఇటువంటి వారి కోవలోకే వస్తారు శ్రీలత. పూర్తిపేరు మోదేపల్లి శ్రీలతా కోటపాటి. పదేళ్ళుగా పరిశీలిస్తుంటే ఎప్పటికప్పుడు తనను తాను బేరీజు వేసుకుంటూ ఇతరుల విమర్శలను స్వీకరిస్తూ పరిణతి చెందుతూ రావటం నేటి రచనా రంగంలో చాలా అరుదు. శ్రీలత కవయిత్రి. కథా, నవలా రచయిత్రి. యాత్రాకథా రచయిత్రి. ఈమె రాసిన నవల "ఖననమ్" ఉత్తమమైన నవల.

ఇదంతా ఉపోద్ఘాతం. అసలు విషయానికి వస్తే శ్రీలత రాసిన కొత్త దీర్ఘ కవిత (లాంగ్ పొయెమ్) "మృత్యుమోహనం". శీర్షికతోనే కవయిత్రి అంతరంగం అర్థమవుతుంది. మన ఉపనిషత్తులు, పురాణ కథలు మృత్యువు గురించి ఎంతెంతగానో వివరించాయి. "మృత్యుదేవత" అనటం మన సంప్రదాయం గానీ "మృత్యు రాక్షసి" అనటం కాదు. సృష్టి స్థితిలయకారకులలో శివుడు లయకారుడు. శివం అంటే మంగళం, శుభం అని అర్థం. మరి లయకారుడు శివుడు ఎలా అవుతాడు? సృష్టి నిత్యనూతనంగా సజావుగా సాగాలంటే లయ కారత్వం తప్పదు. పుట్టినవారు మరణించకుండా– పుట్టేవారు పుడుతూనే వుంటే ఈ జగత్తు ఏమవుతుందో– ఎలా వుంటుందో ఊహిస్తేనే అతి భయంకరంగా వుంటుంది. ఇదే ఆలోచనతో ఇంగ్లీషులో "standing room only" అనే కాల్పనిక నవల వచ్చింది. కాబట్టి మరణం లోక కల్యాణార్థం. మృత్యువు సృష్టికి నూతనోత్తేజాన్నిస్తుంది. మృత్యువుకి భయపడేవాడు మిక్కిలి పిరికివాడు. అంతేకాదు– జీవించటానికి అనర్హుడు.

వీరుడు "విజయమో వీరస్వర్గమో" అని మృత్యువును ఆహ్వానిస్తాడు. "జీనాహైతో మరనాసీఖో" అంటాడు విప్లవవాది. "పోరాడితే పోయేదేమీ లేదు- మరణం తప్ప" అంటారు. అంటే కారణ జన్ముడివి- కారణ మృతుడివి కూడా కావాలని సందేశం. భాగవతంలో బలిచక్రవర్తి తాను వామనుడి వల్ల మరణిస్తున్నానని తెలిసినా అన్న మాట కోసం మృత్యువుకి జంకడు. అతడే కారణ మృతుడు! శ్రీనాథుడు అవసాన దశలో చావుకి భయపడకుండా-

"దివిజ కవివరు గుండియల్ దిగ్గురనగ

అరుగుచున్నాడు శ్రీనాథుడమరపురికి" అని ధైర్యంగా పలికాడు. 'చావు అనేది మరొక జన్మ' అనే చెప్పారు. ఆచార్య సినారె ఓ గజల్‌లో మృత్యువు వస్తే- అపుడే కాదు ఇంకా సమయం ఉందని చెప్పి ఒడిలో పడుకోపెట్టి జోకొడతాననడం విశేషం. "త్వమేవాహం"- నువ్వే నేను- అనే కావ్యాన్ని నిజాం వ్యతిరేక పోరాట వీరుడ్ని ఉద్దేశించి ఆరుద్ర రాశారు. "మృత్యువుతో- నువ్వే నేను- నువ్వెక్కడో లేవు" అనే గుండె ధైర్యంతో అంటాడు పోరాట శీలి. ఇది ఉపనిషత్ వాక్యం.

"మృత్యుమోహనం" కావ్యంలో శ్రీలత మరణం గురించిన ఆలోచనలు మన ముందుంచారు. జీవితాన్ని గురించి అందరూ ఆలోచిస్తారు మరణం గురించి ఆలోచించటమే అపూర్వం. అసలిలా ఆలోచించడానికి కూడా ఆత్మబలం వుండాలి. ఎవరో అన్నట్టు "జీవితంపై మనకున్న అభిప్రాయం మరణంపై ఉన్న అభిప్రాయంపై ఆధారపడి ఉంటుంది" నిజమే శ్రీలత స్థితప్రజ్ఞత్వానికి ఈ కావ్యం మచ్చుతునక. జీవితానుభవంలోంచి, మృత్యు అనుభవంలోంచి వచ్చిన పునీత ఈ "మృత్యుమోహనం". ఈ కావ్యానికి ఆమె రాసిన ముందుమాటలు చాలు- శ్రీలత పరిజ్ఞాన తృష్ణను అవగతం చేసుకోవటానికి.

"నగ్న జీవితపు నిజమై
నా కోసం
అర్రులు చాస్తూ పరితపిస్తావు!
కౌగిలికై చేతులు చాస్తావు!
కన్నులు అరమోడ్చి కవ్వించి
కనికరించమని దోసిలి చాస్తావు
పసిపాపలా నాకోసం పాకులాడతావు"

-ఎవరు? మృత్యువు! కాలధర్మాన్ని గుర్తు చేస్తూ నిత్యం జాగృతం చేస్తూంటుంది మృత్యువు. నిజమే గదా! మనం జీవించి ఉన్నామా, మరణిస్తున్నామా అనే అవగాహన ఏమాత్రమూ తెలీకుండా ప్రవర్తిస్తుంది మృత్యువంటారు శ్రీలత. వేదాంత తత్త్వమూ ఇదే.

ఒకరోజు ముగిస్తే ఒకరోజు మరణించినట్టే అంటారు. ఈ తత్వాన్ని మానవుడు గ్రహించ లేకపోతున్నాడు.

"మళ్ళీ తోటమ్మ ఒడిలో పూవులాంటి
పునీతమైన పుట్టుకనిస్తావా?"

అని మృత్యు దేవతను ప్రేమగా అడిగితే ఎంత బావుంటుంది!

"అరుదులు చాస్తే ఎంతకీ
అందుబాటులోకి రాదు"

మృత్యువంతే కదా! 'చస్తే బాగుండు' అనుకుంటాం. నాకు చావురాదే అని తపిస్తాం. అయినా రాదు. ఎప్పుడు రావాలో దానికి బాగా తెలుసు.

"ఉత్తమ నటనా బహుమతులెన్నో
దుమ్ము దులిపి లెక్కబెట్టుకుంటూంటే
'ఇక చాల్లే' అని కసిరేసి
చిటికెన వేలు పట్టి లాక్కెళ్లిపోతాడు"

- ఎంతటి విశిష్ట అభివ్యక్తి! 'చిటికెన వేలు పట్టి' అనడంతో అమాంతంగా, అనురాగం తో మృత్యువు తీసుకుపోతుందని భావం. మనమీదగల అనురాగంతోనే మృత్యువు వస్తుందనడం అపూర్వమైన భావనా శిల్పం! మృత్యు దశను అభివర్ణించిన తీరు కూడా గమనించాల్సి వుంది:

"విషాదాంతానికి తాళం వేస్తూ తమకిస్తుంది
చూపొకటి అంచులు అపేసే దాకా వెళ్ళి
రంగుల్ని పారేసుకు వస్తుంది.
నిశ్చలన దేహానికి
నిరాశా తులసి తీర్థం పోస్తూ
కావలి కూర్చుంటుంది.
తల దగ్గర ప్రమిదకు
వెలగాలని వెలగాలని ఆరాటం"

- ఇదీ కవితా శిల్పం అంటే! అభివ్యక్తి వైవిధ్యం అంటే!

ఈ కావ్యంలో మరొక ప్రయోగ శిల్పం ఇది-

"అతనో ఉషోదయం
మనమే హిమకణం"

"తనే శబ్దం మనమే మౌనం"

"అతనే కాలమానం మనమే ఒక ఘడియ"

అంటూ విభిన్నంగా మృత్యువుకీ జీవనానికీ గల అనుబంధాన్ని లేదా అంతరాన్ని వ్యక్తం చేస్తూ జీవన్మరణాల వాస్తవికతను ఎఱుకపరిచే ప్రతిభావంతురాలు శ్రీలత.

"అటెళ్ళకని మెదుల్లా అరికాళ్ళను ఆదేశిస్తుంది"

"కాడ్‌బరీస్‌లు తింటూ విసిరేసిన

సున్నుండల డబ్బా రేకు చివికి పోయింది"

"జ్ఞాపకాల పచ్చబొట్టై ఆకుపంక్చరీ అని మభ్యపెడుతూ"

– ఇటువంటి కొత్త పంక్తులు మనల్ని స్థిమితంగా ఉండనివ్వవు. 'డిస్టర్బ్' చేసేదే ఉత్తమ కవిత్వం అయితే "మృత్యుమోహనం" ఉత్తమ కావ్యం. అయితే ఇటువంటి కావ్యాలు ఎప్పుడో ఒక్కసారే వస్తాయి. వచ్చినపుడు ఆహ్వానించటం సహృదయ లక్షణం. భిన్నవాదాల, సిద్ధాంతాల కవితారంగంలో వెల్లివిరిసిన తాత్త్విక పారిజాతం ఈ "మృత్యుమోహనం"!

హైదరాబాద్ – డా॥ ద్వా.నా.శాస్త్రి

# కృతజ్ఞతలు

"అంకితం పుచ్చుకొని ప్రతీకాత్మక కావ్యంగా దీనిని అభివర్ణించి అభినందనలు తెలియజేసిన డా॥ సి.నారాయణరెడ్డి గారికి,

"వస్తువు వినగానే కవిత చదవకుండానే వెంటనే వెలుగులోకి తెండి ఆలస్యం చేయవద్దు" అని సభాముఖంగా అభిప్రాయం వెలిబుచ్చి నన్ను తొందరపెట్టిన డా. వి.యస్. రమాదేవిగారికి,

నన్ను ప్రపంచ కవులతో పోలుస్తూ "బహుశా ఇలాంటి వస్తువు తీసుకున్న కవయిత్రి శ్రీలత మాత్రమేనేమో అనుకోవలసి ఉంటుంది" అని వస్తువుకు బలం, కవితా సంపుటికి విలువ పెంచుతూ ముందుమాట రాసిన వాడ్రేవు చినవీరభద్రుడిగారికి,

మరో ముందుమాట రాసి ఈ కావ్యంలోని నూతనత్వాన్ని గుర్తించి వెంటనే అచ్చులోకి తేవాలని ఆతృత కనబరచడమేకాదు బాధ్యత కూడా వహించిన డా. ద్వానాశాస్త్రిగారికి,

అచ్చువేసి వెలుగులోకి తేవడమేకాదు అందరికీ అందుబాటులోకి తెచ్చేలా ప్రణాళిక వేసిన శ్రీ గుడిపాటిగారికి,

ఈ కావ్యంలోని కొన్ని భాగాలని ప్రచురించిన 'వార్త', 'చినుకు' సంపాదకులకు,

పుస్తకం తెరిచి చదవాలనుకుంటున్న మీకు,

మనసా వాచా కర్మణా కృతజ్ఞతలు.

– మోదేపల్లి శ్రీలతా కోటపాటి

# జాతస్య మరణం ధ్రువం

ఎన్నో సంవత్సరాలు బ్రతికి కూడా "చావు అనేది తరుముకొస్తుందని ఒక్కడైనా తలవడు. జీవితమే శాశ్వతం అనుకునేవాళ్ళే ఎక్కువ. మరణం అనేది ఒకటుందని తలచే నిత్యం తలచేవాళ్ళు కోటికొక్కరైనా ఉన్నారో– లేదో. జీవం ఆకర్షించే యముడొకడున్నాడనీ మరణకాలంలో అతడికి చిక్కవలసి వస్తుందని తల్చుకుని ఎవరయితే భయపడతారో అలాంటివారే గడచిన దినాలలో మనమెంత పుణ్యపాపాలు చేసుకున్నాదీ పునరాలోచించు కుంటారు" అంటుంది గరుడపురాణం.

మరణం తనను అంటిపెట్టి ఉన్నదని విశ్వసించినవారి జీవితం ఆవిధంగా తలంచిన వారికంటే భిన్నంగా ఉత్కృష్టంగా ఉంటుందనేది అనాది కాలసత్యం.

అమెరికన్ జన్యుశాస్త్ర మార్గదర్శిగా భావించే క్రయింగ్ ఏంటర్ 20 మంది దిగ్గజాలైన సైంటిస్టుల నోబెల్‌గ్రహీత హోమ్ మిల్టన్‌స్మిత్ నేతృత్వంలో తన ప్రయోగ శాలలో కృత్రిమ క్రోమొజోమ్‌ను తయారుచేశాడు. ఈ కృత్రిమ క్రోమొజోములో జెనటిక్ కోడ్‌ను చొప్పించారు. దాన్ని వేరే జీవి కణంలోకి ప్రవేశపెడితే కొత్తజీవి ఆవిర్భవిస్తుందట. అని 28 అక్టోబరు 2007న ఈనాడు దినపత్రిక ఆదివారం ఎడిషన్‌లో రాసింది.

ఒక జీవిని తల్లీతండ్రీ లేకుండా సృష్టించే విజ్ఞానాన్ని సాధించే మానవుడు విజయుడే.

కానీ మరణాన్ని ఆపేందుకు ఏ సైంటిస్టూ ఇంతవరకూ ఏమి కనుక్కున్న వార్తలు రాలేదు. రాకపోవచ్చు కూడా.

ఎందుకంటే జీవమంత పరిశోధనా సాధ్యం కాదు మరణం మరణం చాలా

చిక్కనిది. మనతో నిరంతరం ఉంటూనే మనకు తన ఉనికి తెలీకుండా చేస్తుంది.

ఓ పువ్వు ఉదయాన్నే పూస్తుంది. ఎంతో అందంగా, ఆహ్లాదంగా గంటల్లోన్నే రాలిపోతుంది.

"పూవు జన్మ ఎంత చిన్నది" అనుకుంటాం.

అలాగే విశ్వకాలమానంలో మనమూ పుడతాం. ఓ అరవై లేదా డెభై పోనీ ఓ వంద సంవత్సరాలు జీవిస్తాం. వెంటనే మరణిస్తాం. కొన్ని కోట్ల సంవత్సరాలుగా ఉన్న కొండలూ ఆక్సిజన్ సముద్రమూ కాంతిగ్రహాలూ మనల్ని చూసి

"మనిషి పుట్టాడు చనిపోయాడు" మానవ జన్మ ఎంత చిన్నది అనుకుంటాము.

విశ్వకాలమానంలో మానవుడు పూవుకంటే తక్కువ కాలం జీవిస్తుంటాడు. పుట్టిన మరుక్షణం నుంచీ మరణానికి ముందు కాలంలోనే ఉంటాడు. ఎంత కాదని వాదన చేసినా ఇది స్పష్టంత నిజం.

టెస్ట్‌ట్యూబ్‌లోనే బేబిని పెంచి అమ్మలేకుండా చేయవచ్చునేమొగానీ... ఏ మనిషీ మరణం లేకుండా చేయలేం.

కనుక అమ్మకంటే కూడా మరణం నిజం.

జన్మ ఎంత నిజమొ మరణమూ అంతే నిజం.

గడుస్తున్న ప్రతి క్షణమూ జీవితకాలంలోని ఓ క్షణాన్ని తగ్గించి మరణకాలానికి మనల్ని నడిపించడమే.

అమ్మ కొన్నాళ్ళు తోడు, నాన్న కొన్నాళ్ళు తోడు. తోడబుట్టిన వాళ్ళు కొన్నాళ్ళు, కన్నబిడ్డలు ఇంకొన్నాళ్ళూ, మనుమలు మనువరాంఢ్రుతోడు.

కానీ అమ్మనుంచీ మనము దాకా అన్నినాళ్ళు మరణం మనకి తోడుగానే ఉంటుంది.

కాలం రెండు భాగాలు. ఒకటి జీవితకాలం. రెండు మరణ కాలం. జీవిత కాలం ఓ వంద సంవత్సరాలయితే... మరణ కాలం కొన్ని కోట్ల సంవత్సరాలు... ఎలాగంటే...

క్రీస్తు జీవితకాలం ఓ వంద సంవత్సరాలు.

క్రీస్తు మరణకాలం ఇప్పటికి 2007 సంవత్సరాలు. అంతమాత్రమేకాదు ఇంకా ఎన్నేళ్ళ సంవత్సరాలు ఈ మానవ ప్రపంచం కొనసాగుతుందో అన్ని సంవత్సరాలు క్రీస్తు మరణకాలమే.

మనం కూడా క్రీస్తులమే. ఎందుకంటే మనం కూడా క్రీస్తు పుట్టినట్లే పుట్టాం. కానీ క్రీస్తు జీవించినట్లు జీవించలేకపోయాం. కనుక క్రీస్తు కాలేకపోయాం అంతే. అంటే క్రీస్తులా గుర్తుండలేకపోయాం అంతే.

క్రీస్తులా గుర్తుండకపోయినా మనకో జీవితకాలం ఉన్నట్లే మరణకాలమూ ఉంది. గుర్తులేముకదా అని జీవితకాలం లేదనడం ఎంత అమాయకత్వమొ మరణకాలం లేదనడం కూడా అంతే అమాయకత్వం.

మరణకాలం ఉన్నప్పుడు జీవితకాలం కంటే మరణకాలం కొన్ని కోట్ల రెట్లు ఎక్కువ.

అంటే గాంధీ జీవించింది ఓ ఎనభై సంవత్సరాలయితే ఆయన మరణించి ఇప్పటికి 64 సంవత్సరాలు. అలాగే కాలం కొనసాగిన కొద్దీ ఆయన మరణకాలం చాలా ఎక్కువయి తీరుతుంది. గాంధీలాగే మనము కూడా. కాకపోతే గాంధీలాగా గుర్తుండము అంతే. గుర్తున్న లేకపోయినా జీవితకాలము ఉన్నట్లే మరణకాలమూ ఉన్నట్లే కదా!

ఇప్పుడు స్పష్టంగా ఉంది కదా!

జీవితం! అంటే జీవి యొక్క జీవన కాలం. మరణ కాలానికి తోడుగా ఉండదు. (అంటే మరణించాక మళ్ళీ జీవితకాలం ఉండి తీరుతుందనేది అస్పష్టం. ఎందువల్లనంటే పునర్జన్మ ఉన్నదనేది ఓ నమ్మకం మాత్రమే నిరూపణ లేదు కనుక.)

కనుక మరణ కాలానికి జీవితకాలం తోడులేదు.

కానీ జీవిత కాలానికి కొంత పరిమితి ఉంది. ఆ పరిమితి కాలం దాటాక మరణం వశం అయిపోతారనేది నమ్మకం కాదు నిజం!అంటే జీవితకాలానికి తోడుగా మరణం ఉంది. జీవితం గడుస్తున్న కొద్దీ మరణం దూరం తగ్గుతుంది. మరణం మనకు దగ్గరవదు. మనమే మరణం దగ్గరకు జీవనమనే వాహనాన్ని ఎక్కి ప్రయాణం చేస్తున్నాం.

అసలు మనతోబాటే మరణం మనల్ని నడిపించుకు పోతున్నది. అంటే పుట్టిన క్షణం... మొట్టమొదటి క్షణం మాత్రమే మనది. ఆ తర్వాత వచ్చే రెండవ క్షణమే మరణానిది. ఆ రెండవ క్షణాన్ని పట్టుకుని మనల్ని చిటికెనవేలు పట్టుకుని తనవైపు తీసుకుపోతుంటుంది. ఆ తీసుకుపోవడాన్ని ఏ శక్తీ ఆపలేదు. కాలం కూడా.

పుట్టిన కొన్ని ఘడియల తరువాత బొడ్డుకోసి శుభ్రపరచి పొత్తిళ్ళలో పెట్టాక అమ్మ చనుకట్టు దరికి చేరతాం మనం.

కానీ పుట్టిన మరోక్షణమే మరణం మన దగ్గరకు చేరుతుంది కణాలు పేర్చిన అమ్మకంటే ముందునుంచే మనకు తోడయిపోతుంది.

ఆ తర్వాత మనల్ని నిర్మించిన అమ్మ కొన్నాళ్ళకు తనకు తోడుగా ఉన్న తన మరణంతో మనల్ని విడచి వెళ్ళిపోతుంది. కానీ మన మరణం మాత్రం మనకు అమ్మ తరువాత కూడా తోడుగానే ఉంటుంది. శాశ్వతంగా మనమున్నంతవరకు కూడా.

తనకు కణాలు పేర్చిన అమ్మను ప్రేమించినంతగా ఏ జీవీ ఇతరులను ప్రేమించదు. మరి అమ్మకంటే ముందే మనకు తోడుగా నిలచి అమ్మ తరువాత కూడా మనల్ని నడిపిస్తూ తీసుకెళ్ళే మరణాన్ని ఇంకెంత ప్రేమించాలి?

"మరణం చాలా విషాదకరం" అనుకుంటాం!

మరి మరణం తోడుగానే జీవితకాలంలో ఎన్నో ఆనందాలూ అద్భుతాలూ సంతోషాలూ తన్మయత్వాలూ ముద్దులు మురిపాలు సరసాలు సల్లాపాలూ సంబరాలూ పరవశాలు పొందుతుంటాము కదా.

మరి మరణం విషాదం అయితే మరణం తోడుగా ఉన్నప్పుడు ఇవన్నీ పొందకూడదు కదా! ఈ భావాలన్నీ కలుగకూడదు కదా! విషాదమే కొనసాగాలి కదా!

అంటే మరణం విషాదం కాదు మరణ కారణం విషాదం!

అనగా సంతోషంతో హార్ట్ఎటాక్ వచ్చేవాళ్ళూ ఉన్నారు. సంతోషంలోనే మరణించే వాళ్ళూ ఉన్నారు. నవ్వుతూ ప్రాణం పోయిన వాళ్ళున్నారు. సునాయాసంగా అలసట లేకుండా మరణించేవారే ఎక్కువ శాతం ఉన్నారు.

అలాంటి మరణం విషాదంలో లేదు! ఆనందంలోనే ఉంది.

మనం మరణించడానికి పొందిన కారణం ఏదయితే ఉందో ఆ కారణం విషాదమే కానీ మరణం కాదు.

ఒకవేళ యాక్సిడెంట్లో మరణిస్తే... కత్తిపోట్లతో మరణిస్తే... ఏదయినా రోగగ్రస్తం అయ్యి మరణిస్తే... ఎంతో బాధకు గురి అయి మరణిస్తే... ఆ మరణం విషాదం.

ఆ మరణం కారణాల వల్ల విషాదం అయ్యింది.

ఇంకో ఉదాహరణ. ఓ వ్యక్తి ఏదయినా పెద్ద నేరం చేసినప్పుడు అతను సహజంగా మరణించకుండా ఏదయినా బాధమయ కారణాలవల్ల మరణింపచేస్తే అది శిక్ష అవుతుంది.

అందుకే శిక్షకు శిలువ వేసి... ఉరితీసి... కత్తితో మెడనరికి బాధాభరితమైన మరణాలను సృష్టించి మరణింపజేయడం శిక్షలుగా చెలామణీ అయ్యాయి.

ఇక్కడ కూడా ఓ వ్యక్తి తనంత తాను సహజ కారణాలవల్ల మరణించడం బాధాకరం కాదని నిరూపించడమైనది. అది శిక్షకాదని భావించడం జరిగింది.

అదీకాక ఒక వ్యక్తి మరణం. ఆ వ్యక్తికి విషాదం కాదు. ఆ వ్యక్తిని అలుముకుని ఉన్న బంధుత్వ వ్యక్తులకు విషాదం.

ఆ బంధువులు బాధపడతారు తప్పితే మన మరణం వలన... బాధపడం... మనము ఏడవము. అసలు బాధకు కారణమైన మెదడు భాగాలూ కన్నీటికి కారణమైన లక్రిమల్ గ్లాండ్స్ మనకు మరణించాక పనిచేయవు. కనక బాధకు సంబంధించిన భావన... బాధకు స్రవించే కన్నీళ్ళు మనకు రావు. మన మరణం వల్ల మనకు బాధ ఎంతమాత్రమూ కలుగదు.

కనుక మన మరణం మనకు విషాదం కాదు. మనవాళ్ళకు విషాదం.

అంటే విశ్వనిజం మరణం విషాదం కాదు.

పైగా జీవనకాలంలో కూడా మనకు తోడుగానే ఉండే మరణం యొక్క ఉనికి కాలం జీవన కాలం కంటే కొన్ని రెట్లు ఎక్కువ.

జీవనకాలంలో మనకు మరణం తోడుంటుంది. మరణకాలంలో జీవన కాలం చాలా కొద్దిమందికే తోడుంటుంది. అంటే ఓ వ్యక్తి మరణించినా జీవించి ఉండే అవకాశం ఆ మనిషి చేసే సత్కార్యాల మీద ఆధారపడి ఉంటుంది.

అందుకే మనం అతికొద్ది జీవన కాలంలో జీవించి ఉండడం కాకుండా అతిపెద్ద మరణకాలంలో జీవించే ఉండేందుకు కొన్ని సత్కార్యాలు చేసేందుకు ఉపక్రమించాలి. ఇది వేరే సందర్భం.

ఇలా మనకు విషాదం కాని మరణాన్ని, జన్మించిన మరో క్షణం నుంచీ మనకు శాశ్వతంగా తోడుండే మరణాన్ని మనం ప్రేమించక్కర్లేదా?

మరి ప్రేమించాలంటే దానికో ఆకృతి ఉండాలిగా అని ఆలోచన రావడం చాలా సహజం.

ఎందుకంటే మానవుడు ఈ సృష్టిని పరిశోధిస్తూ పోతున్న కొద్దీ ఎంతో విస్మయాన్ని పొందుతూ పోతున్నాడు. ఇంకా పరిశోధించిన కొలదీ విస్మయం పెరుగుతూనే ఉండి తీరుతుంది.

అలాంటి విశ్వాన్ని తను సృష్టించలేదు. ఇంకెవరయినా సృష్టించడాన్ని తను చూడలేదు. కానీ విశ్వం ఉన్నది నిజం. ఎవరూ సృష్టించడం చూడకపోయినా చూస్తున్న ఈ విశ్వం మాత్రం కటిక నిజం. ఈ నిజం ఎలా ఏర్పడిందన్న తన ప్రశ్నకు తానే సమాధానంగా ఓ భగవంతుడు సృష్టించాడన్న భావన నేర్పరచుకున్నాడు.

కనిపిస్తున్న ఈ విశ్వాన్ని సృష్టించిన ఆ భగవంతుడికీ ఓ కనిపించే రూపం ఉండి తీరాలి కదా.

అందుకే ఒక్కో నమ్మకం ఒక్కో ఆకృతిని సృష్టించుకుంది. ఒక్కో నమ్మకమే ఒక్కో మతం. ఆ ఆకృతులే దేవతలు.

మరి విశ్వం తనకు అతీతం కనుక విశ్వాన్ని సృష్టించిన భగవంతుడికి కూడా ఆ అతీతత్వాన్ని సృష్టించడానికి కొన్ని అతీత శక్తులుండాలని భావించి కొన్ని అతీతశక్తులను ఆ భగవంతుడికి ఆపాదించుకున్నాడు.

బావుంది!

మరి తనకు అతీతమైనదే కదా మరణం కూడా. కనుక మరణానికి ఓ రూపమూ కొన్ని అతీత శక్తులూ ఉండి ఉండాలి కనుక మృత్యుదేవతను సృష్టించుకుని మృత్యు దేవతకు కూడా కొన్ని అతీత శక్తులను ఏర్పరచుకున్నాడు.

కానీ నిజం ఏవిటంటే భగవంతుడికి కానీ మృత్యుదేవతకు కానీ సృష్టికర్త మానవుడే. సరే అవన్నీ మతసంబంధాలు. ఇప్పుడు మన చర్చ మతం గురించి కాదు మరణం గురించి కనుక...

మరి మరణాన్ని ప్రేమించాలంటే విషాదముకాని మనకు నిరంతరం తోడుగా నిలిచే మరణాన్ని... ఆహ్లాదకరంగా నిర్మించుకోవాలి.

మరణం నిజం! అదెంతో ఆహ్లాదకరం!

సృష్టిలో ఓ పువ్వు ఆహ్లాదకరం. ఓ కోయిల స్వరం ఆహ్లాదకరం. ఓ నెమలి

నర్తనం ఆహ్లాదకరం. ఓ చిరుజల్లు ఆహ్లాదకరం. ఓ వెన్నెల సోన ఆహ్లాదకరం. ఓ మంచు తెమ్మెర ఆహ్లాదకరం.

అన్నింటినీ మించి ఓ పురుషునికి తన ప్రియమైన పడతి ఆహ్లాదకరం. అలాగే ఓ స్త్రీకి తన ప్రియతమైన పురుషుడు ఆహ్లాదకరం.

మరి అన్నింటినీ మించి ఆహ్లాదాన్నిచ్చే ఈ ప్రియతమ రూపాన్ని మరణానికిస్తే ఎలా ఉంటుంది?

ఇదీ నా ప్రశ్న.

ఈ ప్రశ్నకు సమాధానమే ఈ కావ్యం.

"మరణాన్ని ప్రేమించాల్సి ఉందా? అవసరమా? దానివల్ల ఏ ప్రయోజనం నెరవేరుతుంది?" ఇదొక మానవ ప్రశ్న.

మానవుడు వ్యాపార జీవి. సృష్టితోనూ వ్యాపారమే చేస్తుంటాడు. అవసరముంటేనే లాభముంటేనే ఏ పనయినా చేస్తాడు. కనుక మరణాన్ని ప్రేమించడం వలనా... మరణాన్ని మనవెంటే ఉందని గుర్తించడం వలన తనకు కలిగే లాభాలు వివరించి తీరాలి.

మరణం తన వెంట ఉంది అనే భావన మనిషి ఆలోచనా సరళినే మార్చివేస్తుంది.

తాను కొద్దికాలంలో మరణిస్తానని తెలిసిన మానవులను ఎవరైనా గమనించారా?

చాలా పరిపూర్ణంగా వ్యవహరిస్తుంటారు.

ఎక్కడికైనా మనం విహారయాత్రకు వెళుతుంటాము. అక్కడ స్నేహితులతో చాలా సరదాగా హాయిగా గడిపేస్తుంటాము. ఆ సరదాలకు ఓ ఆఖరి రోజు వస్తుంది. మరుసటి రోజు మళ్ళీ మన నివాసాలకు వెళ్ళిపోతాము.

మనం మన స్నేహితులను ఆ విహార స్థలంలోని ఎన్నో సుందర దృశ్యాలనూ విడిచి వస్తున్న భావం... స్నేహితులను మళ్ళీ ఎప్పుడు చూస్తామోననే అనుబంధం... మనల్ని ఉద్వేగంగా మారుస్తాయి.

స్నేహితుల పట్ల ఎంతో ప్రేమ మర్యాదలను చూపిస్తాము. అదే మనకు చివరి ఆనందమయపు రోజుగా భావించి...ఆహ్లాదంగా ఉండడానికి ప్రయత్నిస్తాము. జీవితం లోని ఇంకే కల్లోలిత జ్ఞాపకాలనూ దరిచేరనీయము.

అలాగే ఈ జీవితంలోని ప్రతిరోజూ మనం జీవితాన్ని విడచి వెళ్ళబోయే ముందు

రోజుగా భావిస్తే... జీవితాంతమూ ఎన్ని అలజడులున్నా ఆహ్లాదంగా ఉండడానికి ప్రయత్నిస్తాము.

కాలేజి విడిచిపెడుతున్న చివరి రోజు... ఫేర్‌వెల్ పార్టీలో కన్నీళ్ళు రాని విద్యార్థులు ఉండనట్లు... ఆత్మీయత ప్రదర్శించని ఉపాధ్యాయులూ ఉండనట్లు...

మరణానికి ముందు... జీవితాన్ని వదలి వెళ్ళబోయే ముందు ఆర్ద్రతగా ఉండని మనిషి ఉండడు. ఆ ఆర్ద్రత మానవ జీవితానికీ...మానవ సమాజానికీ ఎంతో అవసరం. ఆ ఆర్ద్రతలో ప్రేమ ఆప్యాయతలు వెల్లివిరుస్తాయి. అహం అభిజాత్యాలు నశిస్తాయి. అపోహలు స్వార్థమూ తొలగిపోతాయి. మానవుల మధ్య స్నేహ సౌహార్ద్రతలు నెలకొంటాయి.

"ఎలాగూ మరణించబోయే వాళ్ళమే కనుక కొన్ని మంచి పనులు చేసి మన మరణకాలంలో కూడా జీవించేలా చేసుకుందాం" అనే ఆలోచన వస్తుంది.

మనిషి మనిషిని ద్వేషించడం మానేసి పువ్వులా పరిమళించడం సాధ్యం అవుతుంది.

మానవుణ్ణి మహోన్నతుణ్ణి చేసేది తల్లి మీదో తండ్రిమీదో దైవం మీదో తనకున్న ఇతర అనుబంధాల మీదో దేశంమ్మీదో సంస్కృతి మీదో మతం మీదో జాతి మీదో ఉండే ప్రేమ మాత్రమే. ప్రేమే ప్రతి తీవ్రతకూ పరాకాష్ఠ

చూడగలిగితే ప్రతి మనిషీ ఓ విజేతే. ప్రతి జీవితమూ ఓ చరిత్రే. పుట్టింది ఎక్కడైనా... అనుభవాల బాటసాగి... బాధల అగాధంలో దూకి... ఆనంద జలపాతపై ఎగసి...కష్టాల మురికిని కలుపుకుని...ఇష్టాల నురగల ముసుగేసుకుని సాగే బ్రతుకు ప్రవాహం స్థూలంగా అందరిదీ ఒకటే.

అందరూ మానవులే. అయినా ఒక్కొక్కరి రూపు వేరు, తీరు వేరు, ఆశలు వేరు, ఆశయాలు వేరు, జీవితాన్ని చూసే కోణం వేరు, సమస్యలకు స్పందించే గుణం వేరు.

కానీ మరణాన్ని గురించిన భావన ఒకటే. మరణానికి ముందు అతను పొందే పరిపూర్ణత ఒకటే.

"ప్రపంచ రచయితలందరూ ఆకలి గురించీ దారిద్ర్యం గురించీ పేదవాని గురించీ రాసేదే కవిత్వమంటూంటే మనం మరణాన్ని గురించి రాయాల్సిన అవసరం ఉందా?" ఇదో ప్రశ్న.

అవును ఉంది. ప్రపంచానికి మరణాన్ని గురించిన అవగాహన తేవాల్సిన అవసరం ఉంది. మరణాన్ని ప్రేమించే హృదయం అంతటితో ఆగదు. మానవుణ్ణి ప్రేమించడం

మొదలు పెడుతుంది. మనిషితో మొదలయి అన్ని జీవజాలాలవైపు ప్రయాణిస్తుంది.

ఎందుకంటే పేదవాడొకచోట ధనికులొకచోట జన్మించవచ్చు. వారి నివాసాలూ ఆవాసాలూ జీవితకాలంలో పొంతన లేకుండా ఉండొచ్చు. వీరి సుఖవిలాసాలూ వారి కఠిన ఉపవాసాలూ భిన్నంగా ఉండవచ్చు.

కానీ వారికి వచ్చే మరణం ఒక్కటే మరణ కాలంలో వారిని పూడ్చే లేదా కాల్చే మరుభూమి ఒక్కటే. మరణానికి ముందు వారి జీవి పొందే అనుభూతి ఒకటే. మరణానికి కావలసింది జీవి మాత్రమే. అది పేదదా ధనికులదా అన్న భేదం కాదు. మరణానికి ఉన్న సమానత్వం మరేదానికీ లేదు.

మరణాన్ని ప్రేమించగలిగిన వ్యక్తి మనిషిని ప్రేమించకుండా ఉండలేడు. మరణానికి సమీపాన మనమున్నామన్న భావన జీవితం మీద మమకారం పెంచుతుంది. అది చాలు మానవ ప్రపంచం మహాద్భుతంగా మారడానికి.

"మరణం వెన్నంటి ఉన్నదని తెలిస్తే నిరాశావాదం రేగదా? అన్నీ అనుభవించేయాలన్న వత్తిడిలో క్రూరత్వం పెరగదా?" ఇదీ ఓ ప్రశ్న.

మనం మాత్రం మరణిస్తాం. అందరూ ఉంటారు అనుకున్నప్పుడు నిరాశావాదం మొదలవుతుంది. స్వార్థం క్రూరత్వం ఊపిరి పోసుకుంటుంది.

కానీ మరణం మనవెంట ఉంది. అలాగే అందరి వెంటా అందరి మరణం ఉంది. అనే నిజం మరణాన్ని నమ్మిన వెంటనే తెలుస్తుంది. మనమే కాదు అందరూ... లేదు లేదు... ప్రతి జీవీ మరణించే తీరుతుంది. అన్న నిజం నిరాశనూ స్వార్థాన్నీ పెంచదు పరిపక్వతను పెంచుతుంది.

సద్దాంహుస్సేన్‌లాంటి శిలా హృదయుడు సైతం మరణించే ముందు ఉరిశిక్ష అమలు జరిపే ముందు ఎంతో పరిపక్వంగా ప్రవర్తించాడన్న వార్త ఉంది. ఆ పరిపక్వత తను మరణించబోతున్నాడని తెలిసాక వచ్చింది. ముందునుంచీ ఉన్నది కాదు.

మరి అదే పరిపక్వత మనిషికి ముందునుంచీ ఉంటే ఎంత అద్భుతంగా ఉంటుందీ మానవ ప్రపంచం.

మృగ్యమయిపోతున్న మానవ సంబంధాలు హృద్యం కావడానికి మరణాన్ని గురించిన గ్రహణ అవసరం.

కనుక మరణాన్ని ప్రేమిద్దాం.

మనలను కమ్ముకుని ఉన్న మృత్యువును అర్థం చేసుకుందాం.

జీవిని మృత్యువెలా కమ్ముకుని ఉందో చెప్పేదే ఈ కావ్యం.

ప్రకృతీ పురుషుడిలా జీవి మృత్యువూ.

జీవ మృత్యు సంబంధమే ఈ కావ్యం. వారి అనుబంధమే ఈ భావనా సంబంధం.

ఏదో తన పైత్యాన్ని రాసి దానికి కవిత్వం అని పేరు పెట్టి పైగా జీవ మృత్యు సంబంధం అంటగట్టి... అని అనుకునైనా సరే... ముందుగా చదవండి.

ఓ వ్యక్తి తన ప్రియతమను చేరుకునేందుకు ఎంత సంతోషంగా బయలుదేరుతాడో... ఓ బిడ్డ అమ్మ ఒడిలోకి వెళ్ళేందుకు ఎంత ఆనందపడతాడో అదేవిధంగా మరణం ఒడిలోకి వెళ్ళేందుకు జీవి అంతే మధుర భావనతో బయలుదేరాలి.

మరణాన్ని ముందు పెట్టుకుని మానవ సంబంధాలు నెలకొల్పుకోవాలి. అప్పుడే జగత్తు పరిపక్వమవుతుంది. మనిషి మనిషినేకాదు సృష్టిలో చర... అచరాలన్నింటినీ ప్రేమించగలిగే స్థితికి ఎదుగుతాడు.

మరణాన్ని గురించి చాలామంది కవులూ కవయిత్రులు తమ భావాలను సందర్భోచితంగా వెలిబుచ్చారు.

వేగుంట మోహనప్రసాద్ సరోజినీనాయుడును పరిచయం చేస్తూ "ఆమె మృత్యువునూ, దుఃఖాన్ని... వైరాగ్యాన్ని కౌగిలించుకుని తృప్తిగా హాయిగా మనసారా ఏడ్చి కన్నుమూసింది" అంటారు.

పంజాబీ కవిత్వానికి పాతకాపుగా అమృతాప్రీతమ్‌ను పరిచయం చేసే కవితా పంక్తుల్లో

"ఒక్కనాడు నేనొక
హఠాత్ పుష్పాన్ని చూసి
ఒక్కసారిగా
నా మృత్యువు పూవై పూచిందని
నా ఆఖరి ఉదయపు
చిరుహాసం చిందిస్తాను" అన్న కవితను వాడుకున్నారు.

డేవిడ్ హాల్‌బ్రుక్ గురించి రాస్తూ... ఇతను రాసిన కన్‌వాలెసెన్స్ అన్న రచనలో "ఊదామంటల్లోకి, హాహాకార నగరాల్లోకి, జాన్ ఆఫ్ ఆర్క్ మరణ కాలంలోకి

వెళ్ళిపోతాడు కవి" అంటారు.

మృత్యువును ఆరాధించిన కవయిత్రిగా సిల్వియాప్లాత్‌ను పరిచయం చేస్తూ "చూస్తాగా నన్నెలా చావనివ్వరో" అన్నట్లు మృత్యుభావంతో... "మరణించం ఒక కళ. మిగతా అన్ని విషయాల్లాగే నేనా కళలో ఆరితేరాను" అంటుంది సిల్వియాప్లాత్.

దశాబ్దికొక్కసారయినా ఆత్మహత్యా ప్రయత్నం చేస్తుంది అంటారామెను.

"మహాద్భుతమైన అదృష్టం పట్టింది నాకు. నేను చచ్చిపోయానట" ఈ కవితా పంక్తులు విలక్షణ కవి జాన్ చెరిమన్‌వి.

జె.బాపురెడ్డిగారు తన 'అక్షరానుభూతులు' పుస్తకంలో జీవిత తర్కం అనే కవితలో–

"నేను మృత్యువును, నా వెంట తీసుకువెళ్తాను. ఆ ప్రమేయ ప్రశాంత సాగర గర్భంలోకి, నా జీవితాన్ని, అంతులేని ఆనంద పారవాలలోకి తీసుకువెళ్తాను" అంటారు.

***

అలాగే శ్రీలత ఇలా అంటుంది...

"అమ్మలోని భువి, అగ్ని, ద్రవం, ఆత్మయై/ హవిస్సై
నాన్నలోని ఆకాశం వాయువు రేతస్సై
కలగలిపి నువ్వు పాంచభౌతికమై
ప్రాణంగా శబ్దించినపుడే నాకు అంకితమయ్యావు!
నీకోసం నిశ్చింతగా వేచి ఉన్నా...
నగ్న జీవితపు నిజమై నా కోసం...
అశ్రులు చూస్తూ పరితపిస్తావు!
కౌగిలికై చేతులు చాస్తావు!
నిశ్శబ్దివై పలవరిస్తావు!
కన్నులు అరమోడ్చి కవ్వించి
కనికరించమని దోసిలి చాస్తావు!
పసిపాపలా నాకోసం పాకులాడతావు!"
"సఖా! సౌఖ్యా... శరణం గచ్ఛామీ" అంటూ

విరహంలో విరాజితమౌతావు
తాపమే తపస్సుగా తపిస్తుంటావు!
కాలధర్మమిది! కాలమర్మమిది!
జీవగమ్యమిది జాణసత్యమిది
సజీవ నిర్జీవ మిళిత సహవాసమిది!
అంటూ ఝూము ఝూముకూ
జాగృతం చేస్తుంటాడు!
"ప్రియా ప్రియా
నేనే నీకు ప్రియం కదూ" అంటూ
లాలనగా లయిస్తూ లలితంగా
నిరూపించుకుంటాడు.
పొదివి పట్టుకొ
పదిలపరుస్తుంటాడు
జీవించి మైమరచి ఉన్నామొ...
మరణించి మసలుతూ ఉన్నామొ
ఎంత మాత్రమూ అవగాహనకు రానీడు
మనమే తాపం! అతనే తపస్సు!

***

ఎక్కడినుంచో, ఎక్కడికో
విహ్వాలనయి పరుగిడుతూంటే
దారిపక్కన తారసపడి
రెప్పకొట్టకుండా చూస్తుంటాడు!
ఆ ఒక్క చూపుకే హృదయం
మజ్జిగకుండలా చల్లబడిపోతుంది
కవ్వంలా చిలికి చిందరవందర చేసిన...

ఉద్వేగాలెన్నో వెన్నలా
ముద్దకట్టి తేలియాడతాయి!
అలసిన ఊపిరి విశ్రాంతిగా ఆగి
ఆరాటంగా చూస్తుంది!
అటెల్లకని మెదుల్లా
అరికాళ్ళను ఆదేశిస్తుంది!
అతని నీడ సాగుతూ నావైపే వస్తుంది!
అతనొక అనురాగ చెలమ
ఊరుతూనే ఉంటాడు ఉరవడిగా
ఎంత తోడేసినా తోసేసినా!
వస్తూనే ఉంటాడు
ఎంత నెట్టేసినా ఒట్టేసినా!
అతను అంతరంగ కర్త
ఆంతరంగిక దూత
తనే రహస్యుడు
మనమే బహిష్కృతం!

***

కనురెప్పలతోపాటు
కళ్ళల్లోకి వాలిపోతూ
ముసిముసి నవ్వై
నును పెదవిని వెచ్చదీస్తూ...
గుండె కొసలు గుట్టుగా
తేనెటీగై గుచ్చివిడుస్తూ...
పసితనపు సాగరం ఒడ్డున
లేతమనసు కట్టిన పిచ్చుకగూళ్ళు కూల్చి చూపి

"నువ్వా అంతే" నంటూ
గూడులోంచి గుండెలోంచి
పట్టుపురుగులా ఛేదించుకు వచ్చి
ఎగిరి రమ్మంటూ
బ్రతుకంతా స్వాధీనం చేసుకుని
సాత్త్వికం చేస్తూ...
పంచభూతాల పహారాను
బద్దలు చేసి... అలాగ్గ నన్నెత్తుకుపోయి
మిగులంటూ లేకుండా చేసి
సృష్టిలో కలిపి చిద్విలాస మౌతుంటాడు
చివరి మలుపు, జీవితానికి కొసమెరుపు
చూపిస్తూ చూపులా!
అతనే క్రాంతిరేఖ
మనమే వెన్నంటే ఛాయ!

***

తేలుతున్న ఓ పారిజాతం తూగు
సోలుతున్న తీగకొస మోసే చిగురు
జారిపడుతున్న తేనెపట్టు చినుకు
మోగుతున్న లబ్‌డబ్‌ల మధ్య చిరు నిశ్శబ్దం
కాడకూ తొడిమకూ మధ్య కేసరం...
వీటి గాఢతలో గర్వంగా...
ఓ ప్రాకృతిక సత్యమా...,
మొహమాటం మరిపించుకుని
మురిపాలను మెలివేసుకుని
ఆరాటం అల్లేసుకునీ

చిన్ని చేప సముద్రాన్ని ఈదినట్లు
చిట్టిపిట్ట గాలిని చీల్చినట్లు
వైశాల్యాన్ని ఛేదించుకుంటూ
పిపీలికమై బ్రహ్మాండానికి సరిహద్దు గీస్తూ...
ఉల్లిపాయ హృదయ పొరలు ఒలిచేసుకుని
సశేషంగా శూన్యం ఐపోతూ
స్వప్నంలో జీవితాన్ని నిర్మిస్తూ
పర్యావరణానికి వీడ్కోలు చెప్పేసి
పవిత్రంలోకి పారిపోయాక
సరికొత్త అద్భుతమైన ఇంకో జన్మకు రూపునిస్తావా...?
"మళ్ళీ తోటమ్మ ఒడిలో పూవులాంటి
పునీతమైన పుట్టుకనిస్తావా...
అందంగా క్షణికమైనా పరిమళిస్తా
తీపితేనియ చినుకుల్ని
తోటవిందులుగా, సమర్పిస్తూ కన్నుమూస్తా"నంటూ
స్త్రీత్వం నేను సమతౌల్యం సర్వస్వాతంత్ర్యం నేను
ప్రకృతిని పురుషుడేం చెయ్యగలడు
పూజించడం తప్ప...!
అని విర్రవీగుతున్నపుడు
కోరిక కొమ్మ వంచి
తీరికగా కోసుకెళ్తాడు.
మనమొ, పూవు! అతనో తోటమాలి!

***

పరిస్థితులెప్పుడూ అంతే
ఇష్టాయిష్టాల మధ్య

మెడవిరిచే ఉరికంబపు ముసుగుల్లా
చేసే హత్యకు సాక్షి శబ్దాల్లా...
మౌనంలో నరాలు తెంచే గావుకేకలై
బాధకు భయపడిన గుండెచప్పుళ్ళను భయపెట్టి
వడగాలి కాల్చిన కపాలపు కంటి నరాలౌతాయి
గొంతు నరాలు నులుముతూ గమకాలు తీస్తూ
వెకిలి వెకిలిగా చీమునెత్తురు కాలుస్తూ
చిందులు వేస్తూ...
బ్రతికివున్న మరణమో
మరణించిన బ్రతుకో
మొత్తానికి పరిస్థితులు ముందో వెనకో చచ్చుబడిని తెస్తాయి.
పారదర్శకత్వం చూపిస్తూ
పగబట్టి ఎదుట నిలుస్తాయి!
ఐనా అతని కనురెప్ప విదిలింపుతో
మేఘం అంచులు మెరిపించుకున్నట్లు
నన్ను నేను ఆవిష్కరించుకుంటాను.
అతనే విశ్వవిన్యాస కర్త
మనమే అణుమాత్రపు అమరిక.

***

విశ్వాన్ని ఓ ఆకర్షక శక్తి
సూత్రీకరిస్తూంటుంది నిరంతరమై
కక్ష వదలని నక్షత్రాలు
జీవిత సత్యాలై వెలుగుతుంటాయి
నిజాల పదార్థాలు
పెటిల్లుమని పగిలినట్లు

గుండెల్లో ఓ విస్ఫోటనం జరుగుతుంది.
భావాలన్నీ చెల్లాచెదరై
ఆత్మప్రదక్షిణం చేస్తూ
అవని ఆకృతులుగా మారతాయి
అక్కడ ప్రాణవాయువు వెతుక్కుంటూ
పర్యావరణం నన్ను ప్రసవిస్తుంది.
కొమ్మరెమ్మలో పసిపాపనౌతా
తేటతేనియ తీపి తీర్థాన మునిగి
తేటగీతికలాలపిస్తుంటా...
పదపదమంటూ పల్లకీలు తెస్తూ
పాటకంకితమైన నన్ను పట్టుకెళ్తాడు
అతనో నిజం! మనమే భ్రమ!

***

నువ్వు ఆకాశం అవనీ
ఏకం చేస్తూ అలా ఉండిపో
నా మనఃక్షేత్రం ముగిశాక
పరిమళమై నిన్నల్లుకుంటా
నన్ను అమాంతం కమ్మేసుకుని కలవైపో
వినీలంలో విలీనం అవుదాం
భాషలేని ఆ బంధం
సృష్టికి అద్దం పట్టి అర్థం చెబుతుంది.
పదార్థంలో ప్రతిపదార్థంలా
పల్లవిస్తూ ప్రమోదిద్దాం
అంటూ ప్రమాణాలు చేస్తాడు
అతనే భావం మనమే అక్షరం.

***

నల్లని కనుపాప ఓ గాఢాంధకార కుడ్యం
అందులోంచే ఆశల మిణుగురులు
అవిశ్రాంతిగా ఆరుతూ వెలుగుతూ
ఆ జన్మాంతం విన్యాసం.
ఓ కాంతికీ చీకటికీ మధ్య విరామం
ఎన్నో యుగాల జీవి విశ్రాంతి.
వెలుతురూ ఉండిపోవాలనిపిస్తుంది.
చీకటిలా చివికిపోవాలనిపిస్తుంది.
రెండు గాఢాతిగాఢ గంభీరాలు
తూర్పుపడమరల్లా ఆద్యంతాలు
ఆకాశ శరీరంలో అనేక అనేక కణవిన్యాసాలు
ఎన్నో పాలపుంతల ప్రత్యక్ష
కక్ష్యా పర్యవేక్షితాలు
దేహపు మడతలు విప్పి
అనంతంగా పరచి చూస్తే
అన్నీ తేనెటీగలతికిన మైనపుగూళ్ళు
తీపి కోసం చప్పరింతలు రేగేముందు
కరిగించుకుపోతాడలా
తనో అణునిప్పు కటిక
మనమొ తీపి మైనపు ముద్ద!

***

నేనతన్ని గాఢంగా ప్రేమిస్తున్నాను.
అప్పుడప్పుడూ దర్శిస్తుంటాను
ఎప్పుడూ ఆ చేతులలో

నన్ను నేనే బంధించుకుంటాను.
గుండెలోని బహిరంగ ఇష్టుదతడు.
క్షణాలన్నీ అంకితం తీసుకుని
నీడలా జాడలా పట్టుగూడులా
మార్చలేని శాసనంలా
ఒకే కక్ష్యా పయనులంలా!
పారిజాతాలు రాలుతుంటాయి
చుక్క చుక్కగా చిక్కగా
పద ఘట్టనలు కమ్ముకుంటాయి
ఇసుక తుఫాను కుప్పలా
అన్నిసార్లూ తనే వజ్రకవచం
తప్పటడుగులు వేసినా
అడుగులసలు ఆగిపోయినా
తనలో ఐక్యమై
అస్థిత్వాన్ని కోరీకోరీ కోల్పోయేందుకే
ప్రతి గమనం!
అతనే మృత్యువు మనమే జీవితం

***

ఎక్కడో మరి తెలీదు
శిలాఫలకాల మధ్య శిల్పమై
శిలాజమైపోతూంటే
ఎన్ని పొరలు చీల్చుకొస్తాడో తెలీదు
అణువణువూ ఆప్యాయంగా తడిమి
మైనపు ముద్దను చేస్తాడు
పదిలంగా చుంబిస్తూ

ప్రాణం కూడా పోసుకుంటాడు
పవిత్రంగా కర్పూరం నింపి
ఆవిరయిపోయాక
వెనుదిరిగి వెళ్ళిపోతాడు
సులాసనగా చుట్టేయించుకుని
అతనే అనంతం మనమే పిపీలికం.

***

బాల్యం నుండీ భవిష్యత్తు అంతా
ఎండమావుల్లో దిగి ఈదీ... ఈదీ
ఆదరీ... ఈదరీ... అసలే దరీ తెలీక
ఆశగా ఎరను మింగిన చేపలా
నిప్పు కొలిమిలో కాలిపోతూ
నాస్తి... నాస్తి... నా ఆస్తి?
స్థితి... స్థితి... ఏ స్థితి?
మానవులు చీల్చుకుని పీల్చుకుని
లొట్టలేస్తూ చప్పరిస్తున్నారు
దేహం సుఖమిళిత మధుభాండం
చున్నీ జూలెతో తూరుపుకో నమస్కారం
చేతులు కట్టుకుని
కనురెప్పలు తాటించి
పెదవులు విస్తరించి
అల్లావుద్దీన్ అద్భుతదీపంలా
కోరుకున్న గుండెల్లోకి
నిక్షిప్తం కావడానికి నన్ను చేర్చుకుంటూ
వస్తూనే ఉంటాడు.

అతనో ఉషోదయం మనమే హిమకణం.

***

తను మనస్సులో దాక్కుని
చూపుకందని వేళల్లో...
సూర్యాస్తమయంలా కళ్ళు
మెల్లమెల్లగా కాంతిని కోల్పోతాయి.
మనసంతా మబ్బుల్లా
దిగులు కమ్ముకుంటుంది.
కాలం కొండచిలువై కదలనని మొండికేస్తుంది
ఏ మూలో ఆశ పురివిప్పి
తడబడి అడుగుల తాళం వేస్తుంది
అంతరంగం అరవిచ్చి అటూఇటూ కాకుండా
ఆనందభైరవి విలపిస్తుంది...
చీకట్లోనే ఊహలు
తన రూపు చిత్రంగా గీసుకుంటాయి
మలుపు మలుపూ పెదవులతో అద్ది
నుదుటిపై మంత్రాక్షరాలు దిద్ది
శ్వాసను సంధించి
ఊపిరి పోసుకుంటాయి
చిత్రంలోంచి తను
చివుక్కున లేచి వచ్చి
విచిత్రంగా చిత్రంగా మార్చి
ఫ్రేములో కెళ్ళిపోతాడు
కలం ఒంటరిదై
వెక్కివెక్కిపడుతూ

చిత్తుకాగితాలపై చిత్రాన్ని
చిందరవందరగా లిఖిస్తుంది
అతనో చిత్రం మనం చూపు.

***

తనెప్పుడూ అంతే
మట్టిబొమ్మల్ని చేసి ఆటలాడతాడు
విన్నుల్లో మన్నుల్లో
అలమటిస్తూ పలవరిస్తూంటే
ఆనవాలైనా తెలియనీడు.
భేదమై భిన్నమై ఆరాటమై
అశ్రులు చాస్తే ఎంతకీ
అందుబాటులోకి రాడు.
పిలిచి పిలిచి వెర్రియై
నెత్తిబారి ఎద పగిలినా
ఎంతకూ ఎదురుపడదు
అహం విడచి నైవేద్యమై
ఆత్మాహుతి పెడితే
అంకితమసలు తీసుకోడు
అతనెప్పుడూ అంతే
కొమ్మవంచి నేరుగా కోసుకెళ్తాడు
కన్నుల్లో నిక్షిప్తమై కనబడకపోతే
కలగా వచ్చి కలవరింతలు తెచ్చి
కవితల్లో తొడికించుకుంటాడు
గోవుల గుంపుకేసి గోముగా చూస్తుంటే
గోధూళి తానై కమ్ముకుంటాడు.

భవబంధాలతో బహిర్గతం కాలేనంటే
అంతర్భావమై అనుభూతినిస్తాడు
పిలుపు వినబడనిచోట
ఒదిగి ఉంటే
పులకరింతగా వచ్చి పలకరిస్తాడు
తాళంలో రాగంలో తన్మయ స్థితమైతే
ఉలికిపాటు తెచ్చి గమకమౌతాడు.
చుట్ట చుట్టుకొని... చుట్టూ చుట్టుకుని
వలయాలుగా చుట్టూ
జీవితపు పొరలు చుట్టుకుని
ఎన్నో ఏళ్ళుగా ఏకాంతాన్ని వెంటబెట్టుకుని
ప్రతీక్షణం ప్యూపాదశే...
రెక్కలు రాని గొంగళి పురుగే...
పట్టుదారాలతో గూడల్లుకుని
ఊపిరి ఆడక ఉక్కిరిబిక్కిరిలో
విలవిలలు గిలగిలలుగా
బ్రతుకంతా బాధా తపస్సుగా
తమస్సులో మిణుగురులా వెలిగించుకోవాలని
కాల్చుకుని బూడిదవుతూ
గుండుసూదుల్తో గుండెకు
ఆకుపంక్చరీ జరుగుతూంటే
వెలుతుర్ని వేదిక చేసుకుని
జీవితాన్ని పాత్రగా మలచుకుని
మేకప్పులేని నాటకం
రసరమ్యం చేసుకుంటూ

వన్స్‌మోర్ వన్స్‌మోర్ల మధ్య
గాప్‌లో హత్య చేసుకుంటూ
ఉత్తమ నటనా బహుమతులెన్నో
దుమ్ముదులిపి లెక్కబెట్టుకుంటూంటే
"ఇకచాల్లే" అని కసిరేసి
చిటికెన వేలుపట్టి లాక్కెళ్ళిపోతాడు
అతనే నిశీధి మనమే పగలు.

***

ఆకాశం అవనీ
ఏకం చేస్తూ అలా ఉండిపో
సమరం అయిపోయాక
పరిమళమై నిన్నల్లుకుంటా
కమ్మేసుకుని కలవైపో
వినీలంలో విలీనం అవుదాం
భాషలేని బంధంలో
సృష్టికర్థం తెలుస్తుంది.
పదార్థంలో పదార్థంగా
పల్లవిస్తూ సాగిపోదాం
ప్రతిదీ మనకనుకూలిస్తూ
మనలను సాగనంపి తీరుతుంది.
జన్మకర్థం వీడ్కోలులో పొంగే
కన్నీటి కణమని తెలియగానే
సఖా! కరిగి నీరయి వర్షించి పోతానేమొ
అవనిని వదలలేక స్పర్శించి
నిలిచిపోతానేమొ

అన్నీ తెంచేస్తూ అలవోకగా
నన్ను ఎదపైన వేసుకు ఎత్తుకువెళ్ళిపో
కారడవిలోని కటిక చీకటి తప్ప
కాఠిన్యం కార్పణ్యానికి పిండం పెట్టేసి
మానవ సంబంధాలకు తర్పణం వదిలేసిన
మనంలో విశ్వాంతరాళ వేగం,
చలించని చలనం, చూపిస్తానంటూ
కాంతి శూన్యంలో కణికల్లాంటి
గ్రహాలు దారులు పరుస్తూంటే
సాగే వలయంలో సొంతంగా సొంతం చేసుకో
అంటూ
ప్రతీ రాత్రి
మరో రోజు బ్రతకడానికి బ్రతిమాలి
కళ్ళలోకి పిలిపించుకుంటూ
కలల్లో కౌగిలించుకుంటూ
ఒడుపుగా ఒదిగించుకుంటూ
సవరిస్తూ సరిగమలు తెస్తూ
అల్లుకొమ్మని మ్రానై స్థిరమయిపోతూ
ఒక్కో లాలాజలపు చుక్కా జారి
బీటలువారిన గుబుళ్ళలోకి ఇంకిపోతూ
మాధుర్యంగా మట్టివాసన రేపుతుంది.
అక్కడే నిర్లజ్జగా గొంతు పెకలించుకుని
వేదన మరిచి వెర్రికేకగా వెలువడుతూ
పెటిల్లుమనే నరాలు
ఏ కపాల మోక్షపు మంత్రాలో తెలీదు

కోమాలాంటి కునుకును పొంది
మరురోజుకు మల్లియ ఐతే
చిరునవ్వడిగా రేకులు రాలుస్తూ
పుడమికి ప్రణమిల్లుతూంటే
ఎక్కడో గిటారు తెగి తంత్రులు మూర్ఛపోతాయి
అదే మరణమంటుంది ప్రకృతి
తనే శబ్దం. మనమే మౌనం.

***

బరువైన నిశ్శబ్దాన్ని మోస్తూ
ఎన్నో రాత్రులు చీమలబారులా
నడిచెళ్తాయి.
ప్రతి అడుగూ ఆ సన్నిధికి
చేర్చేందుకు
కాలానికి సాయపడుతూ
కదం తొక్కుతాయి.
విలవిల్లాడే ప్రాణాన్ని
పైకెత్తలేని కనురెప్పల్ని
ఉండచుట్టుకుపోయిన శరీరాన్ని వదిలి
ఓ గాఢాంధకారాన్ని
గాఢంగా తరుముతుంది.
ఓ ఆశ ఆశగా అడుగులను
కదిపి విషాదాంతానికి
తాళంవేస్తూ తమకిస్తుంది
చూపొకటి అంచులు ఆపేసేదాకా వెళ్ళి
రంగుల్ని పారేసుకు వస్తుంది.

నిశ్చలన దేహానికి
నిరాశా తులసి తీర్థం పోస్తూ
కావలి కూర్చుంటుంది.
తల దగ్గర ప్రమిదకు
వెలగాలని వెర్రి ఆరాటం
ఉఫ్‌మని ఊదేసి
అదాటుగా మనల్ని
ఆవరించుకు సౌందర్యలోకాలకు
విహారయాత్రకు
విజయం పలుకుతాడు
అతడే అనాది మనమే ఆది.

***

చండ ప్రచండ తాండవకారుడు
చీకటి చెలి సంగమానికి
పడమటింటి దీపంలో ఇమిడిపోతున్నపుడు
ప్రకాశం కోల్పోయిన జగతి
పవ్వళింపు సేదకై ఆవులిస్తూ
ఆదమరుపును ఆక్రమించుకుంటూ
ప్రకృతిచ్చిన పరవశానికి ప్రణమిల్లుతూ
ప్రగాఢమవుతున్నప్పుడు
మల్లెరేకును వేదిక చేసుకుని
మంచు చుక్క నాట్యమాడుతుంది
గుడ్లగూబొకటి కనురెప్పలు చీల్చుకుని
దిశదిశలూ పరికిస్తూ తన్మయరాగం తీరుస్తుంది.
కీచురాయి బావురుకప్పనెక్కి

పహారాకి బయలుదేరుతుంది.
అన్నీ ఆదమరచినపుడే
అడవి నిద్దుర లేస్తుంది.
ఆ మెదళ్ళలోంచే అతను
అన్నింటినీ పూర్తిగా ఆస్వాదిస్తాడు.
అతనే గాఢమైన ఛాయ
మనమే నునులేత వెలుగు.

***

భవబంధాల మధ్య
భవిత చిక్కుల్లో బావురుమంటూంటే
భ్రమల మంచుతెరల్లో
మసకబారిన చూపుకు
సూర్యకిరణమై కాంతినిస్తూ
సృష్టిలోని నిజాన్ని దృష్టిలో నిలిపి
విశ్వసంచలనాలను విదితపరచేలా
నింగికెగసిన ఆత్మను సంధించేసుకుని సౌఖ్యంగా
రాయబారమొకటి రంగులద్ది
రాక తెలుపుతూ పాశమంపుతూ
పయనవేళకు ప్రత్యక్షమవుతూ
పిలువని అతిథిలా
నీ స్థిర నివాసమేదంటూ సైగ చేస్తుంటాడు
చిద్విలాసంగా దేహాన్ని
సమిధను చేసుకుంటాడు
సర్వం సమర్పణ కావించుకుంటాడు
మనమొ జన్మ అతనో జన్మాంతరుడు.

***

అతనంతేనట

ఉద్వేగం ఉద్రిక్తం ఉవ్వెత్తున

ఎగిసిపడేదాక ఎదగనిచ్చి

యవ్వనంతో మిడిసిపాటుతో

మిడిమిడి జ్ఞానంలో నుడివడులు దిద్దిచ్చి

విజయ పతాకమయి కనుచూపు దిగనివ్వకుండా

అహంకారంతో అరికాలును జూడింపజేసి

కన్నూమిన్నూ కానకుండా పేట్రేగనిచ్చి

సుడులు తిరిగే జలసంద్రంలా

వెర్రిలో వెగటు పుట్టేదాకా ఉండనిచ్చి

వేదాంతసారంలో ప్రాక్టికల్స్ కాకముందే

నిజాన్ని దర్శించి నిర్మించకముందే

అయ్యో నేనిన్నాళ్ళూ చూసింది కాలక్షేపం కాదు

రిబ్స్ లెక్కబెట్టుకుంటూ ఖైదీతనం అని

పుట్టె ఓడుబోయేలా అరుద్దామంటే

పసిపాపను చేసి ఉబ్బించి

కంటి తళుకులను అతికించి

మేఘంలా కమ్ముకుని కప్పేస్తాడట

అతనే కాలమానం మనమే ఒక ఘడియ.

***

మనలోంచే పుడుతూ

నిలువెల్లా అల్లుకుంటూ

పట్టుదారాల్తో వెచ్చటి గూడల్లి

అక్కడే ఆ లోపలే

జగాన్ని మరచి సుఖిస్తూ
యుగాలను గాజుగోళాల్లా దొర్లిస్తూ
కాలం కంగారుగా వెళ్ళిపోతుంది.
గుండె చీల్చుకుని వెళ్ళిపొమ్మని
శాసనాన్ని జారీచేసి
చీకట్లో వెన్నెలలా మెరుస్తూ
తొలుస్తున్న ప్రతిసారీ
రంగులేని నెత్తురు ఏరులై పారుతుంది.
అందులో మునకలేసి
రెక్కలార్చుకుంటూ
తిరుగుతూ తిరుగుతూ
తీయని పల్లవులు పాడుతూ
శాశ్వత మనుకుంటూంటే
ఉఫ్‌మంటూ వెలుతురాపేసి
రెక్కలు రాల్చేసి
మళ్ళీ తనలోకి రప్పించుకుని
ముడుచుకుపోతాడు
అతనే సృష్టి మనమే స్పృహ.

***

కంటి కొసన చేరీ
ఓ వెచ్చని చినుకు
చల్లగా ఘనీభవిస్తుంటుంది స్తబ్దంగా
నిశ్చలనే చిత్రానికెన్నడూ
సందడి రాదేమన్న ప్రశ్న
అనుభూతులెంత ఆవేదనలో

మరణించిన మనసు జ్ఞాపకం!
వెక్కిళ్ళ మధ్య నిశ్శబ్దం
గుండెకు మహాసుఖం!
చిరుగాలెరుగని చర్మానికి
పెనుగాలి పరమపద సోపానం!
చెక్కిళ్ళు తడిసీ తడిసీ
పాకుడు బండలైపోయినా
ఏ స్పర్శనూ కోరుకోవు
కాఠిన్యం శిలదా ఉలిదా
రెండూ కాదు శిల్పిది
అణువణువూ చెక్కబడాలి
అద్భుతమైన ఆకృతి మలుపునకు
ఎక్కడో దాన్ని కొనడానికి
కరెన్సీ కాగితాలు తొందరపడుతుంటాయి
అప్పుడే శిల్పి ఒంటరితనంలో
శిలైపోయి శిలాగ్రస్థం చెందేది
ధరిత్రి మీద శిలలన్నీ
శిల్పుల హృదయాలే
కలాల్లో అక్షరాల్లా
కలల్లో స్త్రీలల్లా
అనుకుంటూంటే ఏదో ఉలికిపాటు
శిల్పిశిల్పమూ నాకల్పమేనంటూ
అది అతని జాడే
అందుకే పరిమళాలు
వందిమాగధులయ్యాయి

అతని రాకను అతిమార్దవంగా తెలుపుతాయి
రాకూడని ఓ దుస్స్వప్నం
పసిపిల్లల్ని చేస్తూ బెంబేలెత్తిస్తూ
మనోహోమానికి మంత్రాలు వల్లిస్తూ
గడిచిన క్షణాన్ని ఎంత క్షమిద్దామని
రాబోయే క్షణాన్ని ఎంత ఆశిద్దామని ఉన్నా
అనుభవం దాక్షిణ్యహీనమై
తలపై మేకులు దించుతూ
దుఃఖ వీచికలు వడగళ్ళై మోదుతూ
ఎక్కడో రాని ఆఖరి మజిలీని
ఆహ్వానిస్తూ చేతులు బారసాచి
చేష్టలు నిలబడిపోయి
శవమైపోతూ
ఐనా ఆశ పెదవుల్ని పూయిస్తుంది.
అదే భరోసా అనుకుంటూంటే
అదీ మోసగిస్తుంది
అంతానికి చేరుకున్నాక
ఆదరాబాదరాగా అన్నీ సర్దుకుంటూంటే
జీవించిన క్షణం ఒక్కటి కూడా కనబడదు
మరణించడానికే అన్ని క్షణాల ఆయత్తమూ
అతనే పల్లకీ మనమే పల్లవి.
***

తెరిచిన కంటిరెప్పలు అభిప్రాయంతో
ఆదమరచి మూసుకుపోతాయి
అప్పుడప్పుడూ ఊసరవెల్లిలా
వేషం మార్చుకుని భావం దాచుకుని

అతని చెయ్యి అద్దాల చెక్కిళ్ళను
అదే పనిగా సవరదీస్తూ
ప్రేమ వాక్కులు పలవరింపచేస్తుంది.
ఆప్యాయంగా అనురాగం రాస్తూ
కపాలం బయటపడేదాకా
ఆ స్పర్శ ఎంత మైమరుపో
అంతానికి గమ్యానికి ముగింపుకూ
ప్రేమ పేరు పెట్టి కామించడంలా
కళ్ళు ఏడుస్తూంటే పెదవులు నవ్వుతాయి
ఒకే మనిషి అవయవాలకే అసమన్వయం
మనిషి మనిషికీ మధ్య
ఎండమావిలో తొలకరి ఎలా సాధ్యం?
అనుకుంటూంటే
"సాధ్యం!" అంటూంటాడతను
దృష్టిలో తేమ ఉంటే
ఈ సృష్టిలో ఎండమావే సెలయేరు
తలపులో తలంపు ఉంటే
మనసే పాలసంద్రం
ఈ ప్రపంచం
పసిపాపల నునులేత ఉదరం
అంటూ ప్రమాణాలు చేస్తాడు
అతనే మమత్వం
మనమే త్వమేవాహం!
***
ఆకాశం భూమి బిడ్డను
ఊపుతూ లాలిస్తున్నపుడు

మొగ్గరేకుల్ని మూసి,

చిగురాకులు జోకొడుతున్నప్పుడు

చిటుక్కున జారిన మంచుబిందువు

పారిజాతం ఒళ్ళోకి వెళ్ళి దాక్కునపుడు

మేఘం తల్లి కొంగుచాటున చేరి

చందమామ మోమును దాచుకుంటున్నప్పుడు

కీచుకీచుమనే పిట్టపిల్లల నోటికి

చిటుకులు అందుతున్నప్పుడు

గుడ్లను పొదివేసుకుని

కొండచిలువ కునుకు తీస్తున్నప్పుడు

ఆదమరచి అమ్మ చర్మపు వాసనే

ఊపిరిగా ఉగ్గు తాగుతున్నప్పుడు

చటుక్కున చిటికెన వేలు పట్టుకుని

“బాల్యం అయిపోయింది పదా” అంటూ లాక్కెళ్ళి

యవ్వనంలో పడేసి కన్నూమిన్నూ కానకుండా చేసి

క్షణికంలోంచి కణికంలోకి తీయడానికి

చూపు మరపించి సిరిచాపలా చుట్టుకుపోతాడు

అతనే అతీత కాలధర్మం

మనమే అశాశ్వత కర్మం.

***

ఓల్డేజ్ హోముల్లోంచి

ఒక్క క్షణం బయటకొస్తే ఆ ఇల్లు కనబడుతుంది

ఆ ఇల్లు మూతపడింది

ఆ జీవితం అయిపోయింది.

ఎప్పుడు అటెళ్ళినా మనసు మాత్రం

ఆ ఇంటివైపే అడుగులు వేస్తుంది
అలవాటుగా వెళ్ళి ఆ తలుపు తీస్తే,
పెచ్చులూడిన గచ్చు పగిలిన పెంకులు
అట్టలు కట్టిన బూజులో పడి
అమ్మకుట్టిన కుచ్చుల గౌను...
రంగులెలిసిపోయి లేసులు వేళ్ళాడుతూ
బుట్ట చేతులు చింపేసుకుని ఉందది.
నాన్న కొన్నిచ్చిన పెద్దబాలశిక్ష
అప్పుచెప్పలేకపోయిన పదాలెన్నో అందులో
ఒళ్ళంతా దుమ్ము కొట్టుకుని ముదిగ్గా
ముతగ్గా ముక్క వాసనేస్తూంది
కుళ్ళిన జీవి కండరాల్లా
పట్టుకుంటే పేజీలు ఊడివస్తున్నాయి
మాస్టర్లిచ్చిన కాండేట్ సర్టిఫికెట్లు
మార్కుల మెమోలూ, ఆటపాటల ప్రైజ్‌లు
పగిలిపోయి ఉన్నాయి
చూడక కాలేశానేమొ గుచ్చి విడిచాయి
"అమ్మా" అని అరుద్దామనుకుని
బదులులేదని ఆగిపోయా
ఇంకోమూల ఫ్రేంలేని పెళ్ళిఫొటో
అస్తవ్యస్తంగా నలిగి కళ తప్పింది
కల్యాణం బొట్టు రాలిపోయినట్లుంది.
అరిగిపోయిన టేప్‌రికార్డర్ కాసెట్
అదురుపాటుగా మొదలయి
పిల్లల కేరింతల్ని

వికటాట్టహాసాల్ని చేసి వినిపిస్తోంది.
పిల్లల ఆటపాటల్ని
అమ్మా అన్న పిలుపును
అమ్ముడుపోయినట్లు అనౌన్స్ చేస్తోంది.
మనుమలూ మనుమరాళ్లూ
కాడ్బరీస్‌లు తింటూ విసిరేసిన
సున్నుండల డబ్బా రేకు చివికిపోయింది.
మూలనున్న అద్దం ముక్కలయి
కూతురుగా భార్యగా అమ్మగా
అమ్మమ్మగా నానమ్మగా
ఎన్నో రూపాల్ని చూపుతుంది.
ఆఖరుకు ముడుతలు పడ్డ
ముసలి ముఖాన్ని
వద్దువద్దని తరిమేస్తుంది.
ఆ ఇంట్లో ఒకే ఒక్కమూల
ఎంతో రమ్యంగా చెక్కుచెదరకుండా
బాల్యం నుండీ వార్ధక్యం వరకూ
మంగళకరంగా మిగిలిపోయింది.
అక్కడతను! పూల సౌరభాల్ని
పుక్కిటపట్టి శ్వాసిస్తూంటాడు
ఆ ఊపిరి ఉక్కిరిబిక్కిరి చేస్తూ
అటువైపు లాక్కెళ్తుంది
ఆగలేని అప్యాయం తోస్తుంటే
ఆదాటుగా అటే నడిచెళ్తూ...
అతనే ముగింపు

మనమే మొదలు.

***

గుండెనిండిన బాష్పమొకటి
కదిలితే ఎక్కడ తొణికిపోతూందని
కనురెప్పలు మూసి దాచుకుంటూంటే
ఎదురుగా వచ్చి నిలుచున్నా
ఎదురుచూపులు దొరకవతనికి
ఎదలో ఎప్పుడూ ఉంచుకుని
ఎదను ఏమరుస్తాడేమొ
చినుకు చినుకుగా కురిసి
ప్రవాహంలో తేల్చుకుపోతాడేమొ
వయసు వయసుగా పెరిగి
లబ్‌డబ్‌గా తాళంలో
లయతప్పిన కవాటమై
స్వేచ్ఛతను చేసుకుని
ఊపిరిగా పీల్చుకుని
శ్వాసాన్ని మరిపించి
నిశ్వాసాన్ని ఆపేసి
తెలీత్తెలీదు కానీ
అదెంత ఆకర్షణంటే...
పిలవకుండానే ఆ సన్నిధికి
చేరడానికి యమపాశానికి
ఎవరంతట వారే చిక్కేటంత
అతనో చరమ కదలిక
మనమో అచల కదలిక

మనోచరణ తేలిక.

***

ఆప్యాయంగానో మరేదేదో
చాచిన ఆ చేయి ఆకాశమవుతుంది
హృదితో కలిసి దోసిలైతే
జీవితాన్ని అందులో దాచేసుకోవాలని తపన.
సుడిగుండాలయినప్పుడు
దడి కట్టిన కళ్ళలో
మదినింపే తడిలో
ఊపిరాడక మునిగిపోతున్నపుడో
జ్ఞాపకాల పచ్చబొట్టై
గుండెను గుచ్చుతూ
ఆకుపంక్చరీ అని మభ్యపెడుతూ
ఆ దోసిలోసారి కావాలి
కారుమేఘమై కటిక చీకటిన
కరిగి కరిగి చినుకుగా
అందులోంచి తొణకాలి
అక్కడే గడ్డకట్టి
ఆణిముత్యమై ఆకృతి పొందాలి.
అతనో స్ఫటిక సృష్టితం
మనమో నీటికణం.

***

ఒకే ఒక్క బహిరంగ రహస్యం
సృష్టి మూలంలోంచి తీసి లిఖిస్తా
ఎక్కడైతే తుషారముంటుందో

ఎక్కడైతే చిన్నిచిన్ని పూలు వికసిస్తాయో
ఎక్కడ మేఘాల జాడలుంటాయో
అక్కడ నెమళ్ళు తడబడక నర్తిస్తాయి
ఎక్కడ లోయల లోగిళ్ళుంటాయో
అక్కడ సెలయేళ్ళ పరవళ్ళతో ప్రవహిస్తాయి
ఎక్కడ వసంతం ఉంటుందో
అక్కడ కోయిల పరవశించి పల్లవిస్తుంది
ఎక్కడ నువ్వు నివసిస్తుంటావో
అక్కడ నేను నిరీక్షిస్తుంటాను
అంటూ నగ్నసత్యాన్ని నలుదిక్కులా
నవ్వుతూ ఆవిష్కరిస్తుంటాడు
అతనే గమ్యం
మనమో పయనం.

***

మొగ్గలోని రేకులు స్వేచ్ఛ పొందినప్పుడు
తూరుపు కిరణం మొనదేరి చురుక్కుమన్నప్పుడు
అడవిలో ఆకురాయి చలిమంటను రేపినపుడు
సంద్రంలో ఆలుచిప్ప వానచినుకును
పొదవుకున్నప్పుడు
నీలాకాశం నిశీధి నుండి
ఉల్క ఉలికిపడి రాలిపడినప్పుడు
నీ జ్ఞాపకం కంటి కొస చినుకై
జారిపడుతుంది.
ఎద నిమ్మెక్కి ఓ అనుభవం
మొలకెత్తుతుంది

క్షణాలు యుగాలై మొండికేస్తాయి
అడుగడుగూ ఆర్తితో పరుగిడాలని
పయనం త్వరపడుతుంది
"జీవి మృత్యువు కింత దూరమా" అనే
ప్రశ్న నిలువెత్తునా అలుముకుంటూంటే
సంధ్యా వెలుగులో సాక్షాత్కరిస్తుంటాడు
"సమయమిక లేదులే"
అని సమన్వయపరుస్తుంటాడు
అతనే కాలచక్రం
మనమో కదిలే క్షణం

***

నా పూలు నా చెట్లు నా గాలి
నా పిట్టలు నా గూళ్ళు నా గుహలు
నా ఉడలమర్రి నా వర్షం
నా ఇల్లూ నా వాళ్ళూ
నా ఎండ నా కొండ
విలవిలలాడిస్తూ గుర్తొస్తాయి.
నన్ను నెట్టు! నా అడవిలో [illegible]లిపెట్టు అని
నగ్న గోపిక చేతులెత్తి
విశ్వాన్ని వేడుకుంటుంది.
అడవితీగ మొదలు కోసుకుని
వాలిపోతుంది.
సుడిగాలి చుట్టుకుపోతూ
తోడు రమ్మంటుంది
ఆకాశం చేతులు సాచి

అదుముకొమ్మంటుంది
అర్ధరాత్రి నక్కలు ఆకలితో
ఊళలు వేస్తూ గుమిగూడతాయి.
భువి తల్లి పొరలు పేర్చి
కుళ్ళిపొమ్మంటుంది
పంచభూతాలిచ్చిన
పరమార్థపు బాకీ తీరుస్తూ
భవాన్ని బంధాలతో కలిపి
ఉదయానికి అర్ఘ్యమిస్తూ
ఏమంటూలేని నిశ్శబ్దపు
దిక్కుల్లోకి... గ్రుక్కల్లోకి
జారీ... జారీ...
ఆ సమక్షంలోకి చేరీ... చేరీ...
విలీనానికి వేగిరిపడుతూ
పూచానెందుకో ఓ చిన్ని కొమ్మకు
చూపానెందుకో ఓ వింత వన్నెని
రేపానెందుకో గుండెలో సుగంధిని
చేసానెందుకో వనదేవతను రారాణిని
మోసానెందుకో గర్వచిద్విలాసాన్ని
వేచానెందుకో సూర్యోదయపు చురుకుదనానికి
నిలిచానెందుకో నిద్రలేచే బ్రహ్మాండపు
పారదర్శపు అంచునై పిపీలికానికి
అన్న ప్రశ్నలు సుడులు తిరుగుతాయి
నిశ్శబ్ద పరిమళం గుండె చీల్చుకు స్రవిస్తుంది.
వేచీవేచీ రాలిపోయే రాగమొకటి రగులుతుంది

అప్పుడు కనిపిస్తుందో ఆకారం
జీవించేలా చేస్తాను రమ్మంటూ సాకారం
నిర్నిమేఘమై నివురుకప్పుకుంటూ
మరణ లోకాలను దర్శించేందుకు
జనన కాల తపస్సులో తరించాలని
విశ్వసూత్రమొకటి పురులు విప్పుతుంది
గాలి అలలను తట్టుకుంటూ
నిశ్శబ్ద తాండవం చేస్తూంటే
సరి నర్తకుడనవుతాను రమ్మంటూంటాడు
తానే ఘటన, మనమో నటన

***

అదుగో చూపుడి వేలు కొనసూటిగా
వెళ్తూ... వెళ్తూ... వెళ్తూంటే
పచ్చిక పానుపుపైన చిన్ని పూలతోట
ముందుగా మంచుముత్యాల బాట
అందులో చిన్నారి ఆశల తేట
ఆపైన చిరు ఊహ రేపెను తీయని పాట
ఆ పల్లవెందుకో మాయని మమతల వేట
ఆ వేటలో దొరికే బంగారు జింకవు నీవట
అంటూ ప్రేమలో పడి కలవరిస్తూంటే
యవ్వనపు ఘోషలో వెర్రెక్కిపోతూంటే
ఆకాశంలో కమ్మిన మబ్బుల్లే
నీరెండలో వెలుతుర్ల అంచులతో
వెలుగుతూ వస్తూ
నిమిషమీ బ్రతుకు

నివురుకప్పుకు ఉండకు
కార్చిచ్చువై కల్మషాన్ని
కలబడి కాల్చేందుకు
జన్మ ఒక్కటే నీకు జాగృతమై ఉండు
భవబంధాలతో బందీవయ్యే ముందు
భావమేమిటో తెలుసుకొమ్మని
అనుభవాల వైపు ఆలోచన మళ్ళించి
భావ అనుభావ మధ్య భావమొకటి
ఆవిష్కరించి అనర్గళంగా
భవ్యమైన బ్రతుకుకు భాష్యమౌతుంటాడు
అతనే మరణం మనమో శరణం.

***

ఎక్కడో కాంతి కొలమానంలో
శబ్ద విస్ఫోటనం జరిగినట్లు
ఎప్పుడో ధరిత్రి గుండెలో
ప్రకంపనాలు కదిలినట్లు
గెలాక్సీలో గ్రహాల మధ్య
ఆకర్షణ శక్తి పరుచుకున్నట్లు
కాంతివలయాలుగా చీకట్లో
విహారం చేస్తున్నట్లు
పర్యావరణం ప్రకంపనాలను
పరవశంగా అందుకున్నప్పుడు
నేనో జీవ పరిణామంగా
మార్పులూ చేర్పులూ చేసుకుంటూ
చరిత్రకు చిత్రలిపిలో

శ్రీకారం చుట్టి
కాలాన్ని కదుల్చుతాను
అదేమిటో తెలీదు
నాలో పుట్టి నాలో పెరిగి
నన్ను ఆక్రమించుకుని అల్లరి చేస్తుంటావు
అన్ని క్షణాలనూ నీకే సొంతం చేసుకుని
కాలం లేకుండా కాలాతీతం చేస్తుంటావు
ఆలంబనా అవగాహనా నీవే ఐ
ఆవులింతలు తెప్పించి ఆదమరిపిస్తావు
అరకొర స్పృహలోనే ఆక్రమించుకుంటావు
అన్ని తలపులు పోసి ఓ తీగను పెంచుకుంటూంటే
మరణమనే పువ్వును పూస్తుందది
మరుక్షణమే అతనికి అంకితం చేస్తుంది
అతనే ముగింపు, మనమో మొదలు.

***

ఆలోచించిన కొద్దీ రాటుదేలే
సిద్ధాంతపు గట్టిదనం లాగా
ఎదిగిన కొద్దీ మెత్తబడే
మారుమూలల్లోని మనసులాగా
సిద్ధాంతపు రాటుదనం మనసు మెత్తదనం
కలసిన మనోహర మధ్యస్థంలాగా
నన్నెపుడూ నావను చేసి
తానే దిక్సూచిగా మారి
ఏ దూరతీరాలకో దారి చూపెడుతూంటాడు
నేస్తమా...

ఎక్కడికి తీస్కెళుతుంటావూ...

అని అమాయకంగా ఆకాశంకేసి అడిగితే

అవనిపైనే అరికాలు పక్కనే

అలికిడిని చూపిస్తాడు

అమీబా ఒకటి ఆత్రంగా

పాదాలు కదుపుతూ సాగిపోతుంటుంది

అక్కడికి చూపు మరల్చుతూ

అణువులో మొదలయి

బ్రహ్మాండంలో అంతమయి

అన్నివేళలా నీవెంటే ఉంటూంటాను

అంటూ జవాబు

కేంద్రకంలాగా వ్యాపిస్తుంది

నిశ్చేష్టయై మనముంటే

నిజమై నిలబడతాడు.

అతనే పదార్థం. మనమో ప్రతిపదార్థం.

***

అప్పుడప్పుడూ నీలాకాశం అంచుల్లో

చిన్ని చినుకు ఊపిరి పోసుకుంటుంది

మెల్లగా పచ్చదనం వైపు

పరుగులు తీస్తుంది

ఆ దారివెంటే ఒక్కో చినుకూ కదిలి

చిటపటను మొదలై చిరు వరదను తెస్తాయి

నగ్నమైన చెట్లు నిలువెల్లా తడిచి

సిగ్గుల సింగారాలు పోతాయి.

బరువుల భవాలు మోస్తూ భావగర్భితమౌతాయి
ఒక్కో చినుకూ నేలకు జార్చుతూ చిద్విలాసమౌతాయి
పకపక లాడుతూ సందడితెస్తాయి
తలలూపుతూ నాట్యం చేస్తాయి
పరిమళం చిలకరిస్తూ పూవులను రాలుస్తాయి
వెన్నెల సోన ఒకటి వరదలా వర్షిస్తుంది.
నెమలి పింఛం విప్పి వీడ్కోలు నాట్యం చేస్తుంది.
మేఘాలు చేతులు సాచి ఆహ్వానం తెలుపుతాయి
కాంతికిరణం ఒకటి వెలుగు తోరణం కడుతుంది
ఖచ్చితంగా అప్పుడే ఆగిపోయిన గుండె
అలసట తీర్చుకుంటుంది.
బలవంతపు జైలుశిక్ష నుండీ
ఆత్మ విడుదలయి స్వేచ్ఛా దృక్కులలో
విహంగమై చరిస్తుంది.
గువ్వరెక్కలు తొడుక్కొని గుండె దిక్కులు
వెతుకుతూ దేదీప్యమానమవుతుంది.
అప్పుడు ఎదురొస్తాడతను.
అందరూ ఏడుస్తూంటే...
మనం అతని వెంట వెళ్ళిపోతాం.
అతనే మరణం మనమో జీవితం.

***

మూగ ప్రపంచంలో విలీనమైనా
ఒంటరితనంలో శిలాజమైనా
చిరుగాలితో గొడవపడుతూ
కోయిలతో పోటీపడుతూ

పూవులతో రాజీకొస్తూ
పిట్టల రెక్కలు పట్టుకునేందుకు
పర్యావరణంలో పరుగిడుతూ
ఆకులతో అల్లల్లాడుతూ
చినుకులతో కునుకులు పోతూ
మానవులలో మానవిగా కాదు
జీవులలో జీవిగా జీవిస్తూ
చుట్టూ పరిభ్రమిస్తూ పల్లవిస్తూ
కనిపించే ప్రకృతిలో
కనిపించని తన జాడలు వెతుకుతూ
కమ్ముకునే ఉన్నా గమనించక గమిస్తూ
చుట్టూ చుట్ట చుట్టుకునే భూగ్రహంలో
జీవితం చుట్టూ తిరిగిందే తిరుగుతూ
విశ్రాంతి లేకుండా విసుగులేకుండా
ఒక్కదుటన వస్తాడేమొ
ఊపిరి కూడా ఆడనీయడు
ఒక్క గంతులో ఎగరేసుకుని
ఒక్కంగలో ఎదనేసుకుని
ఎత్తుకెళ్తాడు
అతనే విరామం మనమో ఆరామం.

***

ఏ ఉదయమొ అదృశ్యమై
రాతిరిని తోడు తెచ్చుకుంటుంది
ఏ హృదయమొ కూనిరాగమై
తనను తాను కోసుకుంటుంది.

నిశీధి నిశ్శబ్దంగా నల్లదనాన్ని
ధారాపాతంగా కురిపిస్తుంది.
తీతువు ఒక్కటి తోడుగా శబ్దిస్తుంది
ఊడలమర్రి ఊపిరికి స్వాగతం పలుకుతుంది
పెళపెళలాడే కొమ్మలు
చితిని సిద్ధం చేస్తాయి
ఆకురాయి అదే పనిగా ఒరుసుకుపోతుంది
ఎండ కట్టె కాలుతూ చిటపటలాడుతుంది
పెటిల్లుమనే శబ్దం కపాల మోక్షం చేస్తుంది
ఆశలూ ఊసులూ ఉదయాలు హృదయాలు
ఆనందాలూ ఆరాటాలూ ఆర్భాటాలూ
అగమ్యమై ఆత్మాహుతి చేసుకుంటాయి
ఏవీ అంటలేని ఏకాకితనం
రాలిన ఆకుల్లా గలగలలాడుతుంది.
అప్పుడు కావాలి నేను
హృదిని పరచి హృద్యంగా హత్తుకోవడానికి
అన్నట్లుంటాడతను.
అతనే సర్వజ్ఞత
మనమో అమాయకత!

***

ఏ నిర్మాణంలోనో
వాన చినుకులు చితినార్చి
సగం కాలిన శవాన్ని బహిర్గతం చేస్తాయి.
మరోచోట కవురు నింపుకుని
గాలి శ్వాసను దగ్ధం చేస్తుంది

ఏ మూలో అందాలొలికిన మాంసపు ముద్ద
కరిగి కరిగి అస్థిపంజరం అవుతుంది.
అలాంటప్పుడే గుండె
అన్నిటినీ సమాధి చేస్తూ మూసుకుపోతుంది
అగ్నిలో బూడిదై గాలిలో గాలియై
అగ్నిలో బూడిదై అంతమై అంతమై
ఏ యుగాల నిరీక్షణలోనో
అమృత వృష్టిలో మళ్ళీ పంతమై
కలలలో కాలాన్ని కవితగా రచిస్తూ
మనసులో నైజాన్ని గానంగా వినిపిస్తూ
కొసరుగా మురిపాల ముచ్చట్లు జాడిస్తూ
మరణమే మరో జన్మగా
శైశవంలోకి జారిపోతూ
మరణకాలంలో కూడా మధురంగా జీవిస్తూ!
అతనే యుక్తి మనమే శక్తి

***

నువ్వు నాలో హాయికై ఆపని అన్వేషణ
యుగయుగాలుగా సాగుతూనే
నేను నీలో పొందే ఆగని అనుభూతిక
తంత్రులు తంత్రులుగా మోగుతూనే
తుమ్మెద రెక్కల్లో కొంగుల బారుల్లో
మబ్బు తునకల అంచుల్లో
మెరిసే ఆరే మిణుగురుల్లో
పొందినది పారేసుకుంటూ

అందనిది అ(దులు చాచుకుంటూ
అలా అలా (ప్రకృతి పరవశాలై
కలయిక నుండీ ఎడబాటు
ఎడబాటు నుండీ కలయిక
ఇలా... ఇలా... ఇలా
జీవమై, జగమై, జగన్నాథమై
జగజెట్టీలమై, జంగరమై
మనసులు జాజరలై ఆడుతూ ఆడుతూ
సృష్టి విలాసకేళిలో ఓడుతూ ఓడిపడుతూ
రాత్రిళ్ళు పగళ్ళు కావాలనుకుంటే
పగుళ్ళు అవుతాయి
వానలు కావాలనుకుంటే వడగళ్ళవుతాయి
నిశీధి నిశిని మాయం చేస్తుంది
వెలుగు చీకటి మాయమయి
చిద్విలాసం మిగులుతుంది
చీకటయినా నల్లగా మెరిస్తే బావుండు
అదీ లేదు
ఇంకేం కనిపిస్తుంది రెటీనా పనిచేయదు
నేనూ పూలూ రంగులూ నీరూ అగ్నీ గుట్టలు
అన్నీ వెలిసిపోయి కనిపించనే కనిపించవు
కూజితాలు ఉనికిని తెలుపుతాయి
గాలి శబ్దిస్తూంటుంది
ఇప్పుడు నాకేం కావాలి?
ఇప్పుడు ఏం వద్దు! నువ్వు చాలు
కానీ వెలిసిపోతావు అన్నింటిలానే

అసలయిన శూన్యంలో ఏవీ లేనిచోట
నేనూ వెలిగిపోయి కనే కనిపించనిచోట
నేను కావాలనుకునే నువ్వు...
ఉన్నావనే ఊహ కోసం!
ఆకాశం సముద్రం కలిసే రేఖలోకి
చూపు దూసుకుపోతుంది
నిశ్శబ్దం శబ్దం ఏకమయి
సంభాషించుకుంటున్నప్పుడు
భాష కోసం వెంపర్లాడుతూంటే
భావమై ఎదురొస్తుంటాడు
ఆకాశపు మబ్బులు సముద్రపు అలలతో
సంగమం చెందే పున్నమి వేళ
వెలుగై నిలుస్తాడు
వెన్నెలై వెలిగి వేకువను చూపిస్తాడు
శిఖరపు కొసల మీది మంచుతెరలా
మాయమాయగా అలుముకుంటాడు
నిశ్చలమై నిలిచాననుకుంటూనే
అతని వైపు సంచరిస్తూంటాం
సముద్రపు ఒళ్ళో తలపెట్టుకుని
ఒకే ఒక్కసారి విశ్రాంతి తీసుకోవాలని
ఆకాశం అంద చూసుకుని
అనంతంలోకి అడుగుపెట్టాలని
అనుకుంటూండగానే
అది నిజం చేస్తూ
ఆనందంగా వెంట వస్తూంటాడు.

అతనే అడుగు

మనమే జాడ

***

చల్లని ఉదయం మెల్లగ
నిద్ర లేపుతుంది
పక్షుల కిలకిలా రావాలతో
చక్కని భోజనం తృప్తినిస్తుంది
షడ్రుచుల సంగమంతో
చక్కని వ్యాహాళి నడకకు
అద్భుతమనిపిస్తుంది
ఆనంద డోలికల్లో
గుండె లలితగీతాలు పాడుతుంది
తల్లితండ్రి పిల్లలు భార్య భర్త
స్నేహితులు చుట్టాలు
చుట్టిముట్టి ఉంటారు ప్రేమో
ఈర్ష్యో ద్వేషమో ఏదోటి
వెలిబుచ్చుతూ అందుకుంటూ
అల్లుకుని ఉంటారు
మెల్లగ సాయంకాలమవుతుంది.
అందరూ ఎవరిళ్ళకు వాళ్ళు
ఎగిరెళ్ళిపోతారు.
తల్లి లేదు తండ్రి లేదు
గెలుపు ఓటముల మధ్య
క్షణానికో ఊగిసలాటే
మన పదుల జీవితాలు.

పారదర్శకత కళ్ళకుండదు.
ఎన్నో అబద్ధపు పొరలు
దృష్టిని మసక బారిస్తుంటాయి
ఆ మసకలోంచి అస్పష్టంగా
జీవితపు అసలు రంగు కనిపించదు.
స్పష్టంగా కనిపించేది
శరీరపు దృష్టి అంతరించి
అంతరంగపు దృష్టి ఆవిర్భవించాకే
జీవితమంటే జీవితత్వం
శరీరతత్వం కానేకాదు
శరీరంతో జీవి పోదు
శరీరం పోయాకే జీవి
శరీరపు తోడు కోల్పోయి నగ్నమయ్యేది
అప్పుడు కప్పుకోవడానికి
వస్త్రాలు చాలవు
పరిపక్వత కావాలి.
అదే జీవిని ఆవరించి ఉంఏడ
కపాల కవచం.
ఆ కవచాన్ని ధరించే జీవి
నలుదిక్కులా వెతుకుతుంది
తను పయనించే మార్గం ఏదని
తన విలీనానికి అడ్డంకిగా ఉన్న
శరీరాన్ని వదిలి స్వేచ్ఛను శ్వాసిస్తూ
కాంతి పుంజంలా దూసుకొస్తాడతను
స్వేచ్ఛాయుతమైన జీవిని

ఆస్వాదించి తనలో నింపుకుని
తరలి వెళ్ళిపోయేందుకు
అతనే అనంత జీవ పదార్థం
మనమే అణుమాత్రపు జీవం

***

ఒకరోజులో వేసుకున్న
వస్త్రం మాసినట్లు
ఒక జన్మలో తొడుక్కున్న
శరీరం చికాకు పెడుతుంది.
వదిలేయ్ వదిలేయ్‌మని
ఆత్మ గోల పెడుతుంది

నిన్ను నీవు శుభ్రపరుచుకోమని
తొందర పెడుతుంది.
మనసు మాత్రం
అదే నేను నేను అది అంటుంది.
వస్త్రం మనం కాలేం
శరీరం నువ్వు కాదు
అని తరతరాల వేదాంతం
తల మీద తడుతూ ఉంటుంది.
అటూ ఇటూ తేలక
ఆలోచనల్లో పడిపోతుంటే
నిజంలా వస్తాడతను.
అతన్ని చూశాకే
అన్నీ పటాపంచలవుతాయి.

ఏ వేదాంతం ఏ తర్కమూ
ఏ ప్రీతి ఏ సందిగ్ధము
ఏ వ్యామోహము ఏ బంధుత్వమూ
ఏ తడబాటు ఏ తపనా కలగవు
దూదిపింజలా తేలికయిపోయి
అరవై డెబ్బై కిలోల మాంసాన్ని
ఓ ఇరవై కిలోల ఎముకలని
ఓ ఎనభై సంవత్సరాలు
ఒక క్షణం కూడా దించకుండా
మోసిన బరువు దింపుకుని
అమ్మయ్య అని ఊపిరి వదిలేసి
దీపం వెంట వెలుతురు నడిచినట్లు
పూవు వెంట తావి తరలినట్లు
మురళి వెంట గానం వెంబడించినట్లు
మబ్బుల వెంట నీడ సాగినట్లు
అచేతనులై ఎవరికీ
ఎలాంటి వీడ్కోలూ చెప్పకుండా
నిశ్శబ్దంగా చేరుకుంటామంతే
గగనాలు భువనాలు వీడి
విశ్వగమనంలో వీక్షకులుగా.
తనూ మనమే కనిపించని
మూమూర్తు మూర్తిమత్వం
అతనే సత్యం మనమొ సాక్ష్యం.

***

ఓ రోజు అందమైన తోటలో

సీతాకోక చిలుకనయినట్టు
మరో రోజు మేఘాల పల్లకీలో
మెరుపు తీగల వెలుతురులో
విశ్వాన్ని సందర్శిస్తున్నట్లు
మరోరోజు సెలయేళ్ళ మధ్య
జింకపిల్లనై చిందులు వేస్తున్నట్లు
ఇంకోరోజు ప్రపంచానికే రారాజునై
సృష్టినీ శాసిస్తున్నట్లు
మరో రోజు ఇంద్రధనుస్సులోని
ఏడు రంగుల్తో వెలిగిపోతున్నట్లు
ఇవన్నీ కలలే!
దేహాన్ని నిద్రలో వీడిన
మనస్సులోని కోరికల జాడలే
చటుక్కున నిద్రలోంచి మెలకువ
ఓ దోమ కుడితేనో,
ఓ శబ్దం తడితేనో
ఓ పిలుపు ఆపితేనో
ఓ పని లాగితేనో
చటుక్కున ఉలికిపడి లేచి
"అబ్బా బంగారం లాంటి నిద్ర"
"అబ్బో అద్భుతమైన కల"
అనుకుని నిట్టూర్చి
రోజువారీ రొటినిటీలో
కొట్టుకు పోతూంటే
ఆ బంగారాన్ని శాశ్వతం చేసుకో

ఆ అద్భుతాన్ని నిజం చేసుకో
అంటూ ఓ వరాన్ని
చేతబట్టుకుని ప్రత్యక్షమవుతాడు
అమృత కలశాన్ని ఇచ్చే మోహినీరూపంలో

నేను శాశ్వత నిద్రను తెచ్చే
అద్భుతమైన అనుభూతి ఇచ్చే
మరణమనే మహాదేవతను
అంటాడు అర్థం కానట్టు చూస్తే!
ఓడోఫోన్ కుక్కలాగా
మనసు అతని వెంటే పరుగు
అప్పట్నుంచీ కలలేని నిజం
అయిపోయి మనమే అద్భుతమవుతాం
అతనే దాత మనమే స్వీకర్త.

***

నవ్వితే నవ్వలేవు
కుళ్ళుకుంటాయి
ఏడిస్తే ఓదార్చలేవు
నవ్వుకుంటాయి
ఇవి శరీరానికి సంబంధించిన
బంధుత్వపు బంధాలు
మనసుతో వీడికి బాంధవ్యం
శుద్ధ అబద్ధం.
నవ్వీ నవ్వీ అలసిపోతావు
ఏడుపూ నవ్వూ లేని స్థితికి

జారుకుంటున్న సమయంలో
తూరుపు తొలిరేకు విచ్చుకుంటుంది
జారిపోతున్న వేషాన్ని
సర్దుకుంటూ

ఎవరో రాసి నటింపచేస్తున్న
డైలాగుల్ని బట్టీ పడుతూ
బలవంతపు భావప్రకటనలు
మార్చిమార్చి వెలువరిస్తూ
నటరత్న నటకిరీటి
బహుమతులందుకుంటూ
అవి పట్టుకునే ఒక్కోసారి
రంగస్థలం మీదే బొర్లాపడుతూ
డైలాగులు మర్చిపోయి తడబడుతూ
ఎలాగో ఒలాగ నాటకాన్ని
పూర్తి చేసుకుని నడుం వాల్చాక
హడావిడిగా అతనొస్తాడు

ఇక ఏ శరీరాల్లేవు
ఏ డైలాగులూ ఉండవు
ఏ భావప్రకటనలూ అక్కర్లేదు
ఏ రంగులూ పులుముకోనవసరం లేదు

ఒకే ఒక్క నటన
దాని పేరు మౌనం

ఒకే ఒక్క డైలాగ్
అదే ఓంశాంతిః
ఒకే ఒక్క భావప్రకటన
అదే చిద్విలాసం
పదా! అసలు రంగానికి
అని అలవోకగా నడిపించుకెళ్తాడు
అప్పటిదాకా తిరిగి బొర్లాపడి
నేర్చుకున్నవి నేలపాలే
అతనే సూత్రధారి
మనమొ పాత్రధారి .

***

జీవితపు కష్టాల్లో ఒక్కొక్కడు
నిప్పుల్లో వంకాయల్లా కమిలిపోయి
జీవితంలో సుఖాలెక్కువయి ఒక్కొక్కరు
ఫ్రిజ్‌లో పెట్టిన వంకాయల్లా పీల్చుకుపోయి
కష్టాలున్నా కష్టమే
సుఖాలెక్కువయినా నష్టమే
కష్టనష్టాల మధ్య బ్రతుకుందదు
ఉంటే అది, లేకపోతే ఇదీ!

మనిషికుండే రెండే రెండు కాంప్లెక్సుల్లా!
దేంట్లో ఎక్కువసేపున్నా తట్టుకోలేం.
మనం తట్టుకోలేమని తగ్గవేవీ
అటో ఇటో డబ్బాల్లో రాళ్ళల్లా
కొట్టుకునీ కొట్టుకునీ గోలగా బ్రతికేస్తూ

అసలు మనం మౌనంగా మిగలం
మన కష్టాల్లో... సుఖాల్లో మిగులుతాయి.
వాటినే తీరిగ్గా నెమరేసుకుంటూ
నిశ్శబ్దంగా నిట్టూర్చుకుంటూ
సెల్ఫ్ రెస్పెక్ట్ లేదా
సెల్ఫ్ పిటీల మధ్య
సెల్ఫ్‌ను చంపేసుకుంటూ
వైకుంఠపాళీ ఆటలో
ఎక్కిన నిచ్చిన చూసి మురుస్తుండగానే
మింగేసిన పాము తోకలోంచి
బయటపడుతూ బావురుమంటూ
దిగాలుగా కూర్చుంటే
దిక్కుల్లోంచి దృక్కుల్లోంచి
ఊడిపడతాడు.
"ఆటలింకా అవలేదా
బొమ్మలు కట్టిపెట్టే వేళయింది" అంటూ.
అప్పుడు తెలుస్తుంది
అసలు నిజం
మనం ఆడేమని ఓడలేదనీ.
అతనే ఆటగాడు! మనమొ తోటి బొమ్మలం.
అతను లేందే
అంకెలు పక్కనలేని
సున్నానవుతావనుకున్నా,
ఆమె లేనిదే సున్నా చేరని
అంకెలమవుతామనుకున్నా,

పిల్లలు లేనిదే.
భవిష్యత్తు శూన్యమనుకున్నా,
తల్లి తండ్రి లేనిదే
బాధ్యతలు బరువేల యనుకున్నా,
అనుకోవడంలోనే అంతమవుతాయవని.

వాటిలో ఏదీ శాశ్వతంగా
అంటి ఉండదు.
జీవితమంతా పోగు చేసి
ఎదురు చూసేది అందుకు కాదు.

నా పనైపోయింది ఇక వెళ్ళొచ్చు
అనుకునే వాళ్ళతో కాదు
పనికి వచ్చినన్నాళ్ళే
వాళ్ళూ పనికి వచ్చేది.
పనైపోయాక కూడా
పనికి వచ్చేదేంటంటే
పక్కుమని నవ్వుతాడతను
ఆ నవ్వుల్లో జారిపడేవే ముత్యాలు
అనంతకోటి బ్రహ్మాండపు సత్యాలు.
బూజు పట్టి ఉంటే
తాజాదనపు శ్వాసల్ని నింపి
తనతో కలిసి రమ్మంటాడు
అప్పుడే శూన్యపు సున్నా
అయిపోయి ఆగిపోతే

పక్కన అంకెలా నడుస్తాడు.

అలా వెంట నడిచెళ్ళాల్సిందే

స్టెప్ బై స్టెప్

కూడికలూ తీసివేతలూ కొనసాగాల్సిందే

చివరికి శేషం లేకుండా

అశేషమై అనంతవాహినిలోకి

అతనో లెక్క మనమొ అంకె

***

అంతూ పొంతూ లేని

అనంత పదార్థంలో

పేలిపోయిన ఉపగ్రహశకలాల్లా

మనసు గిరికీలు కొడుతూనే ఉంటుంది.

అర్థం లేదు పర్థం లేదు

గమ్యం లేదు రమ్యం లేదు

ఉన్నారో లేదో తెలీని

గ్రహాంతరవాసుల్ని

ఊహకందినట్లు ఊహించుకున్నట్లు

లేని సుఖానికి ఏవేవో

ఉదాహరణ లిచ్చుకుంటూ

అడుగు తీసి అడుగు వేసినప్పుడల్లా

అదిరదిరపడుతూ

అనంతంగా అదే దారిన

అదే పనిగ నడుస్తూ

ఒకే సూర్యుణ్ణి ఒకే చంద్రుణ్ణి

అనాది నుంచి తరతరాలుగా చూస్తున్నాం.

అంతూపొంతూ చిక్కనట్లు
అవే ఆలోచనలు అవే వేదనలు
అన్నింటిదీ అదే దారి
ఎంత నడిచినా ఆ దారి నలగదు.
ఎంతదూరం వెళ్ళినా
ఇదే ముగింపనిపించదు.
ఎక్కడ ఎక్కడని వెతుకుతుంటే
ఎదురొస్తాడతను.
హంస రెక్కల వాహనం తోడు
అందులో ఎక్కడానికి
శరీరం లేదని!
ఆత్మకు తోడుగా పరమాత్ముడౌతాడు.
అతనే ఫుల్‌స్టాప్ మనమొ కామా
శరీరం రసమయై
ఉన్నప్పుడు
రంగుల ప్రపంచాన్ని పంచరంగుల్తో పరికిస్తున్నాడు.
శారీరక ధర్మాలలో పడి
ఆత్మ తనను తాను
ఆవిష్కరించుకోలేదు.

ఈ శరీరం వద్దనిపించినపుడు
ఈ జీవితం అబద్ధంగా
ఎదుట నిలబడినపుడు
అద్దంలో ప్రతిబింబంగా
అద్దంలో ప్రతిబింబంలా

ఆత్మ కళ్ళకు సాక్షాత్కారిస్తుంది.
అప్పుడది కొత్త అందాలను
ఆపాదించుకుని
ఆపాదమస్తకమూ అలంకరించుకొని
వినీలాకాశంలోకి
విస్తారంగా చూపులు సారించి
కొత్త పెళ్ళికూతరవుతుంది.
వెళ్ళబోయే అనంతతీరాల లోని
తన కొత్త జీవితం గురించి
కోకొల్లలుగా కలలు కంటుంది.
పల్లకీలు కాదు మేనాలు కాదు
ఏ.సి. కారు కాదు, పూల సందడీ లేదు.
పరవశాన్ని వెంట తెచ్చి
మమైక్యాన్ని ముందు పెట్టి
వృద్ధాప్యంలో కూర్చోబెట్టుకుని
తరలి వెళ్ళిపోతాడతను.
అతనే అనాది వరుడు
మనమే నేటి వధువు!

***

పసితనం పాలుకారుతున్నపుడు
అందరూ ఎత్తుకుంటారు.
స్కూల్‌లో ఫస్ట్ వస్తున్నపుడు
అందరూ మెచ్చుకుంటారు.
ప్రేమలో మునిగినపుడు
ముఖాన్ని చుంబిస్తారు.

పిల్లలకు ఉపయోగపడినపుడు
చక్కగా గౌరవిస్తారు.
వయసుడుగుతున్నపుడు
ఒక్కొక్కరే దూరమవుతారు.
వయసు పండినపుడు
అసలెవ్వరూ దరి చేరరు
అందరితో ఎడబాటు
అప్పుడు ముఖం
నలిపేసిన కాగితం మీది
బొమ్మలా ఉంటుంది.

నరాలు ఘనీభవించపోతాయి.
మోయడం కుదరదనీ
పాదాలు మొండికేస్తాయి.
పగలే చీకట్లు కమ్ముకుంటాయి.
నిరాశా నిస్పృహలే నిధులపుడు.
మౌనమే ప్రపంచం.
ఒక్కో అవయవమూ
స్ట్రైక్ చేసి కూలబడుతుంది.
బయటికెళ్తే హాస్పిటల్‌కే!
పడమర అస్తమయంలోంచి
ఓ రాగాన్ని తోడు తీసుకుని
ఇంద్ర ధనస్సుపై ఊరేగుతూ
వస్తాడతను.
వద్దనిపించే కాలం నుంచీ

దోచుకెళ్ళాలని.
అందరూ వద్దన్నాకే
అతను కావాలంటాడు
ఎవరూ లేరన్నాకే
నేనున్నా నంటాడు.
ఎప్పటికయినా తప్పనిదే
ఎందుకీ తొక్కిసలాట
ఏనాటికైనా మనలోకమదే
ఎందుకీ పరలోకపు
ప్రాపంచిక జిజ్ఞాస.
ఎప్పటికైనా విడిపోయేవే
ఎందుకీ బంధాల
తోలు బొమ్మలాట.
రాక ఒంటరిదే
కానీ పోక జంటది
ఆ జంట అతనిదే
ఆఖరి క్షణాన
రాలుతున్న ప్రతి చినుకులో
తానే!

జారుతున్న ప్రతీపువ్వులు
వినిపించే ప్రతి శబ్దమూ
తనదే!
కనిపించే ప్రతి విషయమూ
తనకు చెందినదే.

అతనే ఆత్మీయుడు
మనమే ఆత్మ!

***

పదిమందికి చెందినట్లు కాక
నీకు నువ్వు చెందినపుడు
నీకు నిన్ను సాక్షాత్కారించుకున్నపుడు
వెదురు బొంగులోంచి
అంతరిక్షాన్నిదర్శించినట్లు
నీలోకి నువ్వు తొంగి చూసుకున్నపుడు
నీకు ఉందనిపంచే
నిజం అదొక్కటే.
ప్రతి జీవి నమ్మి తీరాల్సిన
నిజం కూడా అదే.

జన్మ గమ్యం ఏది అంటే
ఒక్కటే సమాధానం
మృత్యువు.

బ్రతికీ బ్రతికీ
ఎదిగీ ఎదిగీ
నవ్వీ తుళ్ళీ, ఏడ్చీ
గొడవలు పడి రాజీలు పడి
చివరికి ఏం చేస్తావ్
వెళ్ళిపోతావు!

నువ్వెవరో నేనెవరో
తెలీని అంతరంగంలోకి.
తెలిసే దొక్కటే
ప్రయాణమవుతున్నానని
దగ్గరుండి తీసుకెళ్ళేదతనే.
అతనే గమ్యం
మనమొ రహదారి.

***

ఎన్ని రంగులో మనిషికి.
ఎన్ని జాతులో మనిషివి.
నీది నాది నువ్వు నేను
అంటూ రకరకాల అభినయాలు
రకరకాల భాషల్లో ఆరాటాలు.
జీవుల్లో జీవికి
ఏ జన్మ కావాలో
ఎలాగూ నిర్ణయించుకోలేవు
జన్మెలా ముగించుకొవాలో
తెలుసుకో...!
జీవులన్నింటితో స్నేహించలేవు.
కానీ జీవులన్నిటితో కలిసే మరణిస్తావు.
మరణం పరిధికి ఎల్లలూ లేవు
విస్తారమయిన దృష్టి.

దోమకైనా ఈగకైనా
పేదకైనా రాజుకైనా

ఒకే పిలుపు

ఒకే పల్లకి

ఒకే స్వాగతం

ఒకే మమేకం.

అని భాష్యం చెబుతాడు.

అతనే జీవబంధువు

మనము అతనింటికి అతిథి.

***

కళ్ళల్లో కల్లోల సాగరాలు

దాచుకొంటూ

నవ్వుల్లో అగ్ని పర్వతాలు-

పేల్చుకుంటూ

అంతరంగంలో సుడిగుండాలు

కప్పేసుకుంటూ

ఆలోచనల్లో అనంత ఘర్షణలు

పేర్చుకుంటూ

తాబేలులా ఒక్కో అడుగూ

పాక్కుంటూ

జీవనపు పందెంతో

కుందేళ్ళతో పోటీపడుతూ

నడిచీ నడిచీ అలిసిపోయాక

గమ్యంలో నిలుచుంటాడు.

నీ పరుగు పందేనికి

నేనే గెలుపంటాడు.

బహుమతి నా పలకరింపంటాడు
వెనుదిరిగి చూస్తే
జీవితం అయిపోయి ఉంటుంది.
అతనే చిరు విలాసం
మనమొ చిరు విలాపం.

***

జన్మలో ప్రతీక్షణాన్ని మరో క్షణం
బలవంతంగా దొర్లించుకుంటుంది.
ఒక్కో అనుభవం ఇంకో అనుభవాన్ని
మించి నులి పెడుతుంది.
జీవితమంతా జీవించడానికి
చేసే ప్రాక్టీసే!
నిజంగా జీవించడం ఏమీ లేదు.
ప్లాస్టిక్ సంచిలో తల దాచుకుని
ఊపిరాడక ఉక్కిరి బిక్కిరైనట్లు
ప్రతీ రోజూ బ్రతకడానికి
పోరాటమే.
భావోద్వేగాల మధ్య
పత్రానికీ రొటికీ మధ్య నలిగే
పప్పుదినుసుల్లా ఒకే వత్తిడి
నిజంగా జీవించడమంటే
అడకత్తెర నొక్కుడులో
విశ్రాంతి కోరుకోవడం.
ఏది కావాలో అది మాత్రం ఉండదు.
ఏది అక్కర్లేదో అది పుష్కలంగా లభ్యం.

కావాల్సింది ఉండదు.
ఉన్నది అక్కర్లేదు
ఏదీ మరి అంతూ పొంతూ.
తోక కోసిన మేకలా
మెదడుకు కాలు నిలువదు.
అరుపు ఆగదు.

గుదిబండను మోస్తూ
పరుగు పందెంలో పాల్గొన్నట్లు
అందుకే
సునాయసంగా ఊపిరి పీల్చినట్లు
కన్నులోంచి చూపు దూసుకెళ్ళినట్లు
గొంతులోంచి పాట పొంగినట్లు
కనురెప్పలు తాటించి వదిలినట్లు
చిరుగాలికి ముంగురులు నాట్యమాడినట్లు
అతను రాగానే అన్నీ వదిలేసి
వెంటబడి పరుగెత్తడమే
ఎందికింతాలస్యం
అని నిలదీయడమే
పదపద పదా అని పోరు పెట్టడమే.
అతని ముక్తి
మనమే విముక్తి!
***
అడుగడుక్కో
ఎదగడానికి పోటీయే

ఎదగకపోతే పోటీలోనే
అంతమయి పోవడం
ఎదిగి పతాకస్థాయికి చేరితే
కత్తి కొసమీద ఒంటికాలితే
విన్యాసం.
జారకుండా ఉండడానికి
ప్రతీక్షణం మరో పోరాటం.
ఒక్కసారి పొరపాటు
జరిగితే ఇక ఇహలోకమే
నరక సదృశ్యం.
ఈసడింపుల మధ్య
ఈసురోమంటూ నివాసం!
ఎదగకపోయినా ఎగతాళే
ఎదిగి జారినా ఎగతాళే
మొత్తానికి మొదలు నుంచీ
చివరి దాకా ఎదుటివాళ్ళకు
మన జీవితమొ కామెడీ షోనే
వెక్కిరించి నవ్వడానికి
నవ్వి ఆనందించడానికి
ఆనందిస్తూ నవ్వే పనికీ
మనమొ
వ్యంగ్య ప్రసార మాధ్యమం.

ఓడుతూ గెలుస్తూ
ఎదుటివాళ్ళు నవ్వుకోవడానికి

ఆస్కారాలు సృష్టిస్తూ
బ్రతుకంతా సర్కస్‌లో ఒప్పుకునేలా
వింత వింత విన్యాసాలు
కిందపడీ మీదపడీ
పకపకలు సృష్టించడాలు.

టికెట్ లేని బ్రతుకులు
సినిమాలో వాంప్ రోల్స్ ఎక్కువ
గ్లిజరిన్ లేకుండానే
కన్నీటి సాగరాలు
వాంప్‌ల మధ్య బఫూన్ల
షో అయ్యాక కన్నీటి చినుకులు
చితుకుల బతుకులు
అప్పుడే అతను కావాలనిపిస్తుంది
అతనే విరామం
మనమొ ఆలసట!
***
పరమాత్మనే ఆత్రంగా
కలిగిన దేహమిది

ఎవరి నడక వారిదే
ఎవరి ఈత వారిదే

దేహాన్ని మోసుకుంటూ
ఏళ్ళకొద్దీ ప్రయాణం

పరమాత్మలో లీనమయ్యేందుకు
ఆత్రపడే తాపత్రయం
కనబడదు.
అది పడే పాట్లే జీవితం
అని తెలియదు.

పాట్లే శాశ్వతం అనుకుంటూ
పరమాత్మకై ప్రయాణం
మర్చిపోతూ
అమ్మే లోకం అనుకునే పసిపిల్లలా
తప్పటడుగులు తప్పు అడుగులు
వేసుకుంటూ

నిజాన్ని చూడలేవీ కళ్ళు,
కనిపించేది మాత్రమే
ప్రపంచం కాదు.
కనిపించాని దాన్లో
కనిపించేది పిపీలికం
అని చెప్తున్నా తల
తల అడ్డంగా ఊపుతూ

బావిలో కప్పల్లా
బ్రతుకంటే ఇదేననుకుంటూ
అమాయకంగా, మాయకాన్ని
కనిపెట్టలేక మూర్ఖత్వంలో

బ్రతుకు అర్థం మరిచిపోతూంటే

ఆత్మను పట్టుకెళ్ళి
పరమాత్మలో కలపడానికి
వాహకమై వస్తాడతను
చుట్టూ ఉన్నవన్నీ
దులపరించేసి ఆత్మకు మాత్రం
చిటికెన వేలందించి
చిన్నపిల్లల్లా అడుగులు కదిలిస్తాడు.
అనంతంలో అంతరమయ్యేందుకు
పట్టుకుపోతాడు.
అతనే పరం
మనమే ఆత్మ!

***

పగలంతా పనులంటూ
తీరిక కాని క్షణాల్ని గడిపి
సాధనలూ వాదనలూ
రోదనలూ వేదనలూ
వేడుకలూ కూడకలూ జరిపి
రాత్రయ్యేసరికి
బ్రతుకునూ భవితనూ
దేహాలనూ మోహాలనూ
వదిలి గాఢంగా నిద్రిస్తున్నట్లు
బ్రతుకంతా భ్రమలతో గడిపి
ప్రగాఢంగా పవళించేది

ఒక జన్మ
మళ్ళీ నిద్ర లేవని
గాఢ విశ్రాంతి.
అలసిన వేళ నిద్ర
కమ్ముకొచ్చినట్లు
అయిపోయిన వేళ
తనూ కమ్ముకొస్తాడు.
నిద్రలో ఏమీ కాము
అతనిలోనూ ఏమీ కాము

నిద్రలో బలం పుంజుకున్నట్టు
అతనితో జ్ఞానం పుంజుకుంటాం.
మళ్ళీ లేచి దినచర్యలో పడ్డట్టు
మళ్ళీ పుట్టి జనచర్యలో పడతాం.
అంతమాత్రానికి
"ఏడుపులూ పెడబొబ్బలూ
భయాలు ఉన్నవాళ్ళకే
లోన ఉన్న నీకు
అద్భుతమైన విముక్తి
వెధవ శరీరం
జన్మంతా మోయించుకుంది.
పూవు నొదిలిన పరిమళంలా
గాలితో సహవాసం చేసి
గమ్యం వైపు సాగిపో"
అంటూ అతను

గీతాబోధన చేస్తాడు.
అతనే ఆది ఆచార్యుడు.
మనమే తరతరాల శిష్యులం.

***

భూమి ఏకఖండంగా
ఉన్నప్పటి నుంచీ
ఏడు ఖండాలుగా
విభజించ పడేదాకా
పడినాక
జీవాల స్థితిగతులు
లయగతులు ఎరిగి
జాతుల్ని సృష్టించడంలో
ప్రకృతెంత కష్టపడిందో గానీ
జాతుల్ని అంతమొందించి
కొత్త జాతులకు చోటు ఇవ్వడంలో
ఎంతో ఆదరణ చూపే దేవత
భూమండలాన్ని శాసించిన
డైనోసర్లయినా
భూమి మీద కనబడని
చలిచీమలయినా
ఆ తీర్పుకు కట్టుబడాల్సిందే.
అతనిది ప్రేమ పూర్వక
ఆహ్వానం.
వెళ్ళేపుడు ఆత్మ
నర్తిస్తూ వెళుతుంది.

గానం చేస్తూ సాగుతుంది.
గమ్యం చేరిన ఆనందంలో
గుడుగుడు గుంచెం ఆడుతూ
వెళుతుంది పసిపాపై
భూమికి అతిథిలా వచ్చి
జీవాలను బహుమతిగా
పుచ్చుకుంటాడు.
అతనే మన సంరక్షకుడు
మనమొ పసిపాప!

***

ఐహిక సుఖాలకు
నిలయం విలయం
ఈ శరీరమే!
ఆత్మ కాదు!
తల్లి తండ్రి బంధువులు
భర్త భార్య బిడ్డలు
డబ్బు అధికారం కీర్తి
ఇవన్నీ ఇచ్చే ఆనందాలు
ఆ పరమానందం ముందు
పిపీలికాలు.

ఆ పరమానందాన్ని
దర్శించే శవం
ప్రశాంతమవుతుంది.

ఆ పరమానందాన్ని వీక్షించే
బుద్ధి అచేతనమవుతుంది.
ఆ పరమానందాన్ని కాంచి
మనస్సు మమేకమవుతుంది.
ఆ పరమానందాన్ని శ్వాసించే
దేహం స్థాణువవుతుంది
ఆ పరమానందం
మన చుట్టూ ఆవరించి
ఆహ్లాదాన్ని నింపుతుంది.
అందుకే శవం
నిర్మలంగా ఉంటుంది.
ఇక ఒక్క క్షణం కూడా
భూమండలం మీద
ఉండబుద్ధవదు!
"పద పదా
నన్ను తొందరగా తీస్కెళ్ళు"
అని అతని వెంట పడతాం!
ఒక్కసారి అందులోకి చేరాక
జన్మజన్మల ప్రయాణం చేసి
అలసిన ఆత్మ
అందులోకి సోలిపోయి
లీనమవుతుంది.
దిక్కులు గడ్డ కట్టి
మౌనం అక్కడ
స్పృహ తప్పించే

మమేకం అక్కడ
అక్కడ ఉండే భావం
ఒకే ఒక్క ఆనందం.
మృతం ఎరుగని అమృతం అది
ఎవరికీ తెలియదు నిజం
ఏమిటంటే
అందరం అక్కడికే చేరతాం
ఆ పరమాద్భుతంలో
ఒకరిలో ఒకరం లీనమయి
ఏకరూపంలో మిగిలిపోతాం.
అది బ్రహ్మాండ రూపంలో
మనల్ని విలీనం చేసుకుంటుంది.
అది తెలిసి ఉండడమే
"ఎరుక కలిగి ఉండడం"
అంది శాస్త్రం.
అది తెలిశాక
జన్మ విముక్తికై
వెంపర్లాడతాం

ఆ పరమానందంలోకి
ఆ పరమాద్భుతంలోకి
ఆ పరమపథంలోకి
ఆ అలౌకిక ఆనందంలోకి
ఆ అనంత ధామంలోకి
ఆ అనంత పదార్థంలోకి

ఆ అద్భుత విన్యాసంలోకి

ఆ అకల్మష కేంద్రంలోకి

ఆ విస్మయ వలయంలోకి

ఆ విచిత్ర వైనంలోకి

ఆ వైభవ సత్యంలోకి

ఆ సజీవ జవంలోకి

మనల్ని ఆప్యాయంగా

అక్కడికి చేర్చేదే అతను.

చిట్టచివరి తీర్మానమేమిటంటే

అతనే భౌతిక మరణం

మనమొ ఆత్మిక అమరం.

***

మానవ ప్రపంచపు సాహిత్యంలో వస్తువులు నాలుగే నాలుగు. ఒకటి ప్రేమ, రెండు దైవం, మూడు యుద్ధం, నాలుగు మరణం.

ఎంతోమంది రచనాకారులు ప్రేమనూ దైవాన్ని, ప్రేమనూ, ప్రేమను యుద్ధాన్ని కలిపి ఎన్నో రచనలు రాశారు. ఒకవేళ జీవి ప్రేమనూ మరణాన్ని కలిపిన రచనలు ఎలాంటి తాత్వికతను సంతరించుకోవచ్చునో తెలియచేసిన నా రచన ఇంతటితో పూర్తికాదు. జీవికీ మరణానికీ ఎంతకాలం సంబంధ బాంధవ్యాలు ఉంటాయో అంత కాలమూ ఈ వస్తువు ఇలా అనంతంగానే సాగుతూ ఉంటుంది.

ఇంకా... ఇంకా... రాయాలనిపించినప్పుడెల్లా... ఆ భావాలు రాయమని ఒత్తిడి పెడుతున్నప్పుడల్లా రాస్తూనే సాగాల్సిన వస్తువు ఇది.

ఇది అంతం కాలేదని... చెప్తూ.

రవి అస్తమిస్తూంటే

కవి నిద్రలేస్తాడు

కిరణం విశ్రమిస్తూంటే
చరణమై శ్రమిస్తాడు
కాగితాలపై చమక్కులో చురుక్కులో
చమత్కారంగా గిలుక్కుంటాడు
పాపం! హృదయాన్ని రేడియం చేసి
రక్తంతో రాసుకుంటాడేమొ
పగలు కనిపించవవి
రాత్రుళ్ళు రగులుతుంటాయి.
మీరు రోజూ చూసే
నక్షత్రాలన్నీ కవి అక్షరొత్తరాలే
అందరూ కళ్ళు మూశాక
అందాలు కులుకుతూ అంబరమెక్కుతాయి

ఈ కవితా నేను రాసిందే. ఎందుకంటే నా కవితలు కూడా నేను కళ్ళు మూశాకే అంబరమెక్కి నక్షత్రాలౌతాయని నా ఊహ. మృత్యువు గురించి ఇంకా రాయడానికి నాకున్న అనుభవం ఏవిటంటే, ఆరుసార్లు మృత్యువు దరిదాపుల్లోకి వెళ్ళి రావడమే.

# రచయిత్రి గురించి

| | | |
|---|---|---|
| రచయిత్రి పేరు | : | మోదేపల్లి శ్రీలత 'కోటపాటి' |
| తల్లిదండ్రులు | : | కోటపాటి మురహరి రావు<br>సరోజినీదేవి గార్లు |
| భర్త | : | మోదేపల్లి కొండయ్య గారు |
| సంతానం | : | శిరీష, శుశృతలు |
| ప్రవృత్తి | : | రచనలు చేయడం |

# శ్రీలత బిరుదులు

1. ఊయల కమ్యూనికేషన్స్ వారు 'విలక్షణ రచయిత్రి' అనే బిరుదునిచ్చి సత్కరించారు.
2. ఇంటర్నేషనల్ ఇంటిగ్రిటీ పీస్ అండ్ ఫ్రెండ్‌షిప్ సొసైటీ వారు 'భారతజ్యోతి' మరియు 'హిందురతన్' బిరుదునందించారు.
3. సంస్కృతి ఇంటర్నేషనల్ గోపికాస్ వారు 'సాహితీరత్న' బిరుదునిచ్చారు.
4. జయంతి పబ్లికేషన్స్ వారు 'విభిన్న కథారచయిత్రి' బిరుదునిచ్చారు.
5. సరోజాదేవి చారిటబుల్ ట్రస్ట్, హైదరాబాద్ వారు 'మహిళరత్న' అవార్డుతో సత్కరించారు.
6. కన్సిల్టర్ జనరల్ ఆఫ్ ఇండియా, టర్కీ వారు "డాటర్ ఆఫ్ నైల్" బిరుదుతో సత్కరించారు.
7. షీలా హిందీ విద్యాపీఠ్, బాగల్పూర్, బీహార్ వారు "విద్యావాచస్పతి" బిరుదుతో సత్కరించారు.
8. సంఘమిత్ర ది ఏజ్ ఆఫ్ అకాడమీ అవార్డు (శ్రీ)లంక.

## జాతీయ అవార్డులు

1. 'సైకోఫ్రీప్లానియా' అనే కథ బెస్ట్, కామెడీ కథగా 'రచన' మాసపత్రికలో వెలువడి, 'కేతవరపు కనకదుర్గ అవార్డు' తెచ్చిపెట్టింది.
2. మహబూబ్‌నగర్ కల్చరల్ అసోసియేషన్ వారు 'దాశరథి అవార్డు' నిచ్చారు.
3. పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ వారు 'ఉత్తమ రచయిత్రి' పురస్కారం.
4. సంగం అకాడమీ ఉగాది పురస్కారం.
5. యువ ఆర్ట్స్ విశిష్ట పురస్కారం.
6. కిన్నెర ఆర్ట్స్ థియేటర్ వారి 'విశిష్ట' పురస్కారం (2002)
7. ఆలిండియా పోయెట్స్ కాన్ఫరెన్స్ వారు 'సరోజిని నాయుడు పురస్కారం'తో సత్కరించారు. (2003)
8. రవి అండ్ రవి పురస్కారము (2004)
9. వంశీ ఇంటర్నేషనల్ అసోసియేషన్ వారి 'కోడూరి కౌసల్యాదేవి' అవార్డు (2004)
10. ప్రకాశం జిల్లా రచయితల సంఘం వారి నుంచి "శ్రీమతి సిద్దాసూర్య కుమారి" పురస్కారం.
11. భారతీయ సంస్కృతి పరిరక్షణ సమాఖ్య వారి "ఉగాది" పురస్కారం.
12. 'వెన్నెల స్పర్శ'కు ప్రముఖ వారపత్రిక స్వాతి నుంచి రూ. 500/- నగదు బహుమతి.
13. ఆంధ్రభూమి వారపత్రిక నుంచి రూ. 25,000/- నగదు బహుమతి.

14. "మత్తుగా ... గమ్మత్తుగా" అనే శృంగార నవలకు ఆంధ్రభూమి వారపత్రిక నుంచి రూ. 25,000/- నగదు బహుమతి.
15. మనసా ప్రేమించకే..., ఖననం నవలలకు రూ. 15,000/- నగదు బహుమతులు.
16. ఆరాధన ఢిల్లీ తెలుగు అకాడమి వారి విశిష్ట పురస్కారం (2007)
17. కోల్‌కతాలోని మైఖేల్ మధుసూదన్ అకాడమి వారి అవార్డు ప్రదానం.
18. నారాయణ పుల్లారెడ్డి గారి ఉగాది పురస్కారము (2007)
19. ఢిల్లీ తెలుగు అకాడమి వారి ఉగాది పురస్కారము (2008)
20. నవ్యనాటక సమితి వారి విశిష్ట పురస్కారము (2008)
21. సరోజాదేవి చారిటబుల్ ట్రస్ట్, హైదరాబాద్ వారి 'సరోజాదేవి అవార్డ్' (2009)
22. మాధ్యమిక విద్యాలయాల అడ్వైజర్ డా. మేగ్నెకియగర్, హాంకాంగ్ గారి చేతుల మీదుగా పురస్కారం (2009)
23. బీజింగ్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ డా. మార్గరెట్ చేతుల మీదుగా పురస్కారం.
24. శీలా హిందీ విద్యాపీఠ్, బాగల్పూర్, బీహార్ వారు "విద్యావాచస్పతి" అవార్డును ప్రదానం చేశారు (2009)

**అంతర్జాతీయ అవార్డులు :**

1. డా. అహ్మద్ షరీఫ్ బీబీజాన్, డిప్యూటీ ప్రైమ్ మినిష్టర్, మారిషస్ వారి పురస్కారం (2007)
2. గీతాంజలి మల్టి లింగ్వల్ లిటరసీ సర్కిల్, బర్మింగ్‌హామ్ (యు.కె.) వారి లింగ్వల్ హార్మోనీ అవార్డు (2008)
3. అఖిల విశ్వ హిందీ సమితి, న్యూయార్క్ వారి "హిందీ గౌరవ్ అవార్డు" (2008)
4. గోపియో ప్రెసిడెంట్ డా. పి. నాయర్, సింగపూర్ వారి అవార్డు (2008)
5. మలేషియా కౌలాలంపూర్ వారి అవార్డు.
6. పోంగతెప్, తెప్ ఖంజానా మినిస్టర్, హాంగ్‌కాంగ్ వారి పురస్కారం (2008)
7. డా.మొగ్నెగినాయగర్, అడ్వైజర్,సెకండరీ ఎడ్యుకేషన్, హాంగ్‌కాంగ్ పురస్కారం (2009)
8. డా. మార్గరెట్, ప్రొఫెసర్, ఎస్.ఎస్.యూనివర్సిటి,హాంగ్‌కాంగ్ పురస్కారం (2009)
9. వైస్ కౌన్సెల్ ఆఫ్ ఎకనామిక్ అండ్ కౌన్సెలర్, ఈజిప్ట్ వారి పురస్కారం.
10. కన్సిడర్ జనరల్ ఆఫ్ ఇండియా, టర్కీ వారి పురస్కారం.

**సినీ రచయిత్రిగా :**

1. కన్నడం నుంచి తెలుగులోకి వచ్చిన సినిమాకు మాటలు, కొన్ని పాటలు రాశారు. ఈవిధంగా 2012లో సినీరంగ ప్రవేశం చేశారు.

**నిర్వహించిన పదవులు :**

1. ఆలిండియా పోయెట్స్ కాన్ఫరెన్స్ సెక్రటరీ జనరల్‌గా వుండి ఆలిండియా పోయెట్స్ కాన్ఫరెన్స్‌ను హైదరాబాద్‌లో నిర్వహించడం.
2. మహబూబ్‌నగర్ పీస్ కమిటీ మెంబరు కావడం.
3. కాటన్ సీడ్స్ వ్యాపారంలో శ్రీవారికి కుడిభుజంగా ఉండడం.
4. శిరీషా పౌల్ట్రీ, ఫామ్స్ అధిపతిగా ఉండడం.
5. తిరుమల ఫైనాన్స్‌కు డైరెక్టరుగా ఉండడం.
6. మారిషస్‌లో జరిగిన అంతర్జాతీయ అఖిలభారత కవయిత్రుల సమ్మేళనానికి ఆంధ్రప్రదేశ్ నుంచి సమన్వయకర్తగా వ్యవహరించడం.
7. సఖ్య సాహితీ తెలుగు రచయిత్రుల సంఘం సెక్రటరీగా వ్యవహరించడం.
8. సౌత్ ఇంటర్నేషనల్ పోయెట్స్ కాన్ఫరెన్సెస్, సింగపూర్, మలేషియా, హాంగ్‌కాంగ్, మారిషస్, చైనా, మకావు, ఇంగ్లండ్, అమెరికా, టర్కీ ఈజిప్ట్ కో-ఆర్డినేటర్‌గా వ్యవహరించడం.
9. గోపీచంద్ లిటరసీ నేషనల్ అవార్డ్ కమిటి సభ్యురాలుగా వ్యవహరించడం.
10. డా. వాసిరెడ్డి సీతాదేవి లిటరసీ నేషనల్ అవార్డ్ కమిటి సభ్యురాలుగా వ్యవహరించడం.
11. బి.ఎన్.రెడ్డి పురస్కారానికి కమిటి మెంబరుగా ఉండడం.
12. గురుప్రసాద్ ఎక్సలెన్స్ అవార్డు కమిటి మెంబరుగా ఉండడం.
13. వాసిరెడ్డి సీతాదేవి టీవీ అవార్డ్స్ కమిటి మెంబరుగా వ్యవహరించడం.

**అందుకున్న పటాలు :**

శ్రీలత నవలలు మీద వెంకటేశ్వర యూనివర్సిటీ Ph.D

1. రెల్లుపూలజల్లు మీద తిరుపతి యూనివర్సిటీనుండి స్వతంత్రబాబు యం.ఫిల్ చేశారు.
2. సెంట్రల్ యూనివర్సిటీ నుండి కథలపై యం.ఫిల్.
3. శ్రీలత కథల పేరుతో 75 కథల మీద ఎస్.వి.యూనివర్సిటీలో పిహెచ్.డి చేశారు.
4. ఉస్మానియా యూనివర్సిటీ నుండి వెన్నెల స్పర్శ నవలపై పిహెచ్.డి జరుగుతుంది.

**శ్రీలత ఇతర పుస్తకాలు :**

1. వెన్నెల స్పర్శ, మూడు తరాలు, మనసా ప్రేమించకే నువ్విలా, ఖననం, యాత్ర, జన్మ, దొరసాని, మత్తుగా గమ్మత్తుగా, మౌనం, మనసు ఒక మందారం, రాక్షిమాం, సస్యశ్యామలం మొదలగు నవలలు.
2. రెల్లుపూల జల్లు, కెరటం, పిచ్చుకగూళ్ళు కథా సంపుటాలు.
3. ధిక్కారం, విశ్వంభరి, గుండెల్లో నువ్వుంటే, మృత్యు మోహనం, మానాన్న కవితా సంపుటాలు.
4. శ్రీలత శతకం.



# Mrutyumohanam

Long Poem by

Dr. Srilata

## మేల్పలుకులు

శ్రీలత రాసిన 'మృత్యుమోహనం' ఒక విశిష్ట, విలక్షణ దీర్ఘకవిత. మరణం అంటే మరో జన్మ. 'త్వమేవాహం' అనే ఉపనిషత్ వాక్యానికి ఈ కావ్యం చిరు వ్యాఖ్యానం. జీవితాన్ని గురించి అందరూ ఆలోచిస్తారు. మరణం గురించి ఆలోచించటమే ఈ కావ్య ప్రత్యేకత. మృత్యువు మనమీద అనురాగంతోనే వస్తుంది. ఈ కావ్యం చదివితే మనం కూడా మృత్యుప్రియులవుతామే తప్ప భీరువులం కాము. అందుకే మనవాళ్ళు "మృత్యుదేవత" అన్నారు తప్ప - "మృత్యు రాక్షసి" అనలేదు. ఈ వాదాల, సిద్ధాంతాల గందరగోళం నుంచి పూరా విప్పారిన పారిజాతం వంటిది ఈ తాత్త్విక, సామాజిక కావ్యం.

– డా. ద్వా.నా. శాస్త్రి

మోదేపల్లి శ్రీలతా కోటపాటి ఇప్పుడు మన చేతుల్లో పెట్టిన 'మృత్యుమోహనం' విలక్షణమైన కవిత. కొత్త ప్రయోగం. 'మరణం తన వెంట వుంది అనే భావన మనిషి ఆలోచనా సరళినే మార్చివేస్తుంది' అనే మెలకువ ఈ కావ్యానికి ఇతివృత్తం. ఈ కవిత అలలు అలలుగా ఎగిసిపడే ఒక ఉద్వేగం. తననొక ప్రేయసిగా భావించుకొని మృత్యుహస్తాలకు అప్పగించుకున్న కవయిత్రి శ్రీలత మాత్రమేనేమో అనుకోవలసి వుంటుంది. కావ్యం విశిష్టత అన్నిటికన్నా ముందు ఒక కొత్త ఇతివృత్తాన్ని సంభావించడంలోనే ఉందనిపిస్తుంది నాకు.

–వాడ్రేవు చినవీరభద్రుడు

PALAPITTA
BOOKS